# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

మార్చి 2025

వెల : రూ. 10.00



ఫిబ్రవరి 19 నుండి 23 వరకు శ్రీకాళీవనాశ్రమ గుండుగొలను శాఖ యందు జరిగిన సత్సంగ మరియు బాబూజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠా దృశ్యములు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 44 సంచిక 7

పేజీలు 44

మార్చి 2025

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**

**మేనేజరు**

**సమర్థ సద్గురు మాగజైన్**

**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**

**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ........................ పేజీ**


దాశరథీ శతకము ........................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ.............................. 5

అమ్మమాట........................... ............ 8

ఎంత ఘనుడవయ్యా!.............................11

విశ్వావసు ................ ................. ............13

కర్మఫలం-పుణ్యఫలం - పూజాఫలం-రాశిఫలం.............15

భీమవరం శాఖ ప్రారంభోత్సవ ................ఆహ్వానం 17

సద్గురు సేవ ..............................................19

భగవద్గీత సాధన దీపిక ..........................20

శ్రీగురు పద ప్రహేళిక...... ....... ....... ..... .......22

పరిప్రశ్నేన సేవయా .....................................24

బిల్వదళం - మోక్ష ఫలం..................... ......25

నారద భక్తి సూత్రములు ............... ..............28

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......30

మనశ్శతకము ...............................................32

నిరీక్షణ ..........................................................33

శ్రీ గురుగీత ........................................ ........35

సమర్థ సద్గురు యాజమాన్యం వివరాలు.....................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ...... ........................ ..................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

58. తప్పులెఱుంగ లేక దురితంబులు సేసితినంటి నీవుమా
యప్పవుగావు మంటి నికనన్యులకున్ నుదురంటనంటినీ
కొప్పిదమైన దాసజను లొప్పిన బంటుకు బటవంటి నా
తప్పుల కెల్ల నీవెగతి దాశరథీ కరుణాపయోనిధీ!

భావము :



ఏదో తెలియక తప్పులు చేశాను స్వామీ! కాని నన్ను తండ్రివలె రక్షింపుము. అన్యదైవములను ఎరుగను. నీకు నచ్చిన నీ దాసజనులు మెచ్చిన నీ సేవకుని వంటివాడను. నీవే నన్ను నా తప్పులనుండి కాచవలెను.

---

*వాసుకి దీర్ఘనిద్ర ఎలా తొలగింది?
*పురందరకేశవునికి మోక్షం ఎలా వచ్చింది?
*గురుమూర్తి ఒకరిని ప్రశ్నించిన దానికి మరొకరు సమాధానం చెబితే ఏమవుతుంది?
*ఆసక్తి పట్ల ఎందుకు జాగ్రత్తగా ఉండాలి?
*గురుసేవ లభించాలంటే దేనిని వదిలిపెట్టాలి?
*మానవులకు పుష్టి ఏది?
*మన నిజమైన ఇల్లు ఏది?
*మనస్సుని అద్దంలా చేసుకోవడం సాధ్యమేనా?
*భగవంతుడికి నైవేద్యం ఎందుకు పెడుతున్నాం?
*నాగమహాశయులు, గణపతి మహాముని తమ తోటి శిష్యుల మాటలను ఎందుకు పట్టించుకోలేదు?

**సమాధానాలు లోపలి పేజీలలో ............................**

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

5-5-1981

ఈరోజు ఉదయం ప్రార్థన అయిన తర్వాత శ్రీబాబూజీ వాకింగ్‌కి వచ్చారు. వాకింగ్ అయిన తర్వాత అంతా ముంజకాయలు తిన్నారు. అందులో ఒక భక్తుడు ముంజకాయలు తినడం చేతగాక పైన పెచ్చు తినబోయాడు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'ముంజకాయ పెచ్చు తినకు. కావాలంటే ఇంకొక ముంజ తిను. పెచ్చు తింటే జబ్బు చేస్తుంది' అన్నారు. ఆ భక్తుడు సమాధానం చెప్తూ 'ముంజ కాయలు ఎలా తిన్నా తప్పనిసరిగా మామిడికాయ తినాలి బాబు లేకపోతే కడుపు నొప్పి వస్తుంది' అన్నాడు.



శ్రీబాబు మాట్లాడుతూ 'అయితే నిన్ను ముంజకాయు తినవద్దన్నానని వీరందరికి కడుపునొప్పి రావాలని కోరుకుంటున్నావన్న మాట. సరే ఎలా వస్తుందో చూద్దాం!' అన్నారు శ్రీబాబు.

ఆ తర్వాత శ్రీ బాబూజీ బయట కొంచెం సేపు వాకింగ్ చేద్దాం రండి అన్నారు. అంతా శ్రీబాబూజీని అనుసరించాం. కొంతదూరం వెళ్ళేసరికి అక్కడ ఒక భక్తుని ఇంటి దగ్గర శ్రీబాబూజీ ఆగి 'మీరు ఏం చేస్తున్నారు?' అని ప్రశ్నించారు. వారు సమాధానం చెప్తూ, 'మామిడికాయ పచ్చడి చేస్తున్నాం' అన్నారు. శ్రీ బాబూజీ వెంటనే కలగజేసుకుని మమ్మల్నందరినీ 'మీరంతా ఈ పచ్చడి తినండి. ఇంకా మీకు కడుపునొప్పి ఎలా వస్తుందో చూద్దాం?' అన్నారు.

కొంతసేపు వాకింగ్ చేసిన తర్వాత వసిష్ఠాశ్రమంలో అంతా కూర్చున్నాం 'రాజయోగం అంటే ఏమిటి?' అని ప్రశ్నించి శ్రీబాబూజీ 'రాజయోగం అంటే ఏమిటో నేను చాలా Reasearch చేశాను. రాజయోగం అంటే భార్యా, పిల్లల్ని వదిలివేయటం కాదు. వారిని పోషించుకుంటూ మనస్సుని పరమాత్మునిపై నిలబెట్టాలి. మీ మార్గానికి మీ దారా పుత్రాదులు అడ్డువచ్చారనుకోండి. వారి ప్రభావానికి మీరు గురి కాకూడదు. వారిని కూడ ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్ళించడానికి ప్రయత్నించాలి. వారు రాకపోతే మాత్రం వారి కర్మ. దానిని ఎవరూ తప్పించలేరు.

ఆత్మబుద్ధి స్సుఖం చైవ, గురుబుద్ధిర్విశేషతః, స్త్రీ బుద్ధిఃప్రళయాంతకః పరబుద్ధిఃవినాశకః అని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఇతరులు చెప్పిన సలహాలు పాటిస్తే వినాశనానికి దారితీస్తుంది. స్త్రీల సలహాలు పతనానికి దారితీస్తాయి. నీకు స్వయంగా తోచిన ఆలోచన కూడా మంచిదే. కాని అన్నింటికన్నా ఉత్కృష్టమైనది గురుదేవునియొక్క మార్గదర్శకత్వము. గురుదేవుడిచ్చిన సలహా తు.చ. తప్పకుండా పాటించాలి. మనస్సును గురులక్ష్యార్థమునందే నిలపాలి. అలా చేయటం వలన మనస్సు శుద్ధి చెందుతుంది. మనస్సునందు ఏ విధమైన సంకల్పం కలిగినా అది తాపత్రయానికి దారితీస్తుంది. మనస్సులో ఒక్క సంకల్పం జనిస్తే దాని ద్వారా కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం మొదలైనవన్నీ విజృంభిస్తాయి.

నా దగ్గరకి విజయవాడనుండి ఒక భక్తుడు వచ్చేవాడు. అతను వ్యాపారస్థుడు. వ్యాపారరీత్యా చికాకులు పడ్డాడు. నేను అతనికి కొన్ని సలహాలు ఇచ్చాను. కాని అతని బంధుమిత్రులు నేను చెప్పిన సలహాలను విననివ్వలేదు. చాలా ధనాన్ని నష్టపోయాడు. కాని అతను నన్ను ఆశ్రయించిన భక్తుడు గదా! నేను లోటు చేస్తానా! అతని బిజినెస్ నాది. ఎలాగో అతన్ని రక్షించాననుకోండి. కాని నేను పరోక్షంగా అతనికి చేసిన సహాయాన్ని అతడు గ్రహించగలుగుతాడా? ఇలా ఉంటాయి మహాత్ముల లీలలు. వారికి కీర్తి కిరీటాలు కాని మీ ధనధాన్యాలుకాని కావాలా?' అన్నారు. శ్రీ బాబు తిరిగి, 'ఇలాగే మీ స్నేహితులో, బంధువులో మీలో విషబీజాన్ని నాటారనుకోండి అది క్రమేపీ పెద్దదై మీ పతనానికి దారితీస్తుంది.'

రామకృష్ణ పరమహంస వద్ద నాగమహాశయుడు అనే శిష్యుడు వుండేవాడు. ఆయన చాలా గొప్పవాడు. కొంతమంది రామకృష్ణ పరమహంసకన్నా నాగమహాశయుడే గొప్పవాడు అనేవారూ లేకపోలేదు. కాని నాగమహాశయుడు దాన్ని సహిస్తాడా? అలాగే రమణ మహర్షి మితభాషి. ఎవరితోను ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. ఆయన దగ్గరకు ఎవరు వెళ్ళినా ఏదైనా అవసరము అని తోస్తే సలహా ఇచ్చేవాడు. అంతేకాని ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. రమణ మహర్షి శిష్యుడు గణపతి మహాముని మహాపండితుడు. శాస్త్రాలన్నీ బాగా తెలిసినవాడు. శాస్త్రాలన్నీ తెలిసినవాడు కాబట్టి గణపతి మహాముని రమణ మహర్షికన్నా చాలా గొప్పవాడని అన్నవారూ లేకపోలేదు.

చక్కని ఉపన్యాసాలతో తత్త్వాన్ని బోధించి ప్రజలని ఆకర్షించేవారు అనేకమంది వున్నారు. శాస్త్రవిద్యలుకాని, ఉపన్యాసాలుకాని, పాండిత్యం కాని, సిరిసంపదలుకాని, ధనధాన్యాలుగాని ఎవరినైనా తరింపజేయగలవా? కాని మానవుడిని తరింపజేయగల

విద్య ఒకటి ఉంది. అది స్వానుభవమైన విద్య. అదే ఆత్మవిద్య. అది ఎవరినైనా తరింపజేస్తుంది. అట్టి విద్యని ఆర్జించిన మహాత్ముని ఆశ్రయిస్తే ఫలితం ఉంటుందిగాని వేరొకర్ని ఆశ్రయిస్తే ఫలితం ఏముంది? అన్నారు. తోటలోంచి బయటికి వస్తూ తెల్లగజ్జేరు మొక్కను చూపించి, దానిని తీయమని పురమాయించారు. 'దీనిని పెసరపప్పుతో తింటే చాలా బాగుంటుంది. తీసుకోవయ్యా వెంకటరత్నం' అని ఆయనకి ఇచ్చారు. 'పూర్వకాలంలో ఈ మొక్కని బ్రాహ్మణ్యం అంతా బాగా తినేవారు. కోడిగుడ్లు తినటం మొదలుపెట్టిన తర్వాత దీనిని మరచిపోయారు' అన్నారు శ్రీబాబు.

వెంకటరత్నంగారు మాట్లాడుతూ 'దీనిని మా మనవడు పవన్‌కి పెట్టవచ్చునాండి?' అని శ్రీ బాబూజీని అడిగారు.

శ్రీ బాబు మాట్లాడుతూ 'చూశారా! మమకారం అంటే ఎలా వుంటుందో! భక్తుడు మహాత్మునివద్ద ప్రసాదాన్ని అందుకుని సంతోషంగా ఆ ప్రసాదాన్ని తాను స్వీకరించకుండా తన కుమారునికో, కుమార్తెకో, మనవడికో అందలేదని విచారిస్తాడు. ఇది న్యాయమేనా?' అని ప్రశ్నించారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'మీకొక సంఘటన చెప్తాను. ఒక మహాత్ముడు ప్రేమతో అందజేసిన ప్రసాదాన్ని ఒక భక్తురాలు వెంటనే స్వీకరించక తన కుమార్తెకు కూడా దానిని అందజేద్దామని ఇంటికివెళ్ళి శుచిగా స్నానం చేసి ఇరువురు స్వీకరిద్దామని అనుకుంటుంది. ఇంటికి చేరేసరికి కుమార్తె ఉండదు. ఇంతలో ఆ సమీపంలో ఉండే నదికి పోయి స్నానం చేసివద్దామని ఆ తల్లి వెళుతుంది. తల్లి వెళ్ళిన వెంటనే కుమార్తె ఇంటికి వస్తుంది. వంటగదిలో తల్లి జాగ్రత్తగా దాచి ఉంచిన ప్రసాదాన్ని చూసి తనకోసమే తల్లి ఈ ప్రసాదాన్ని ఉంచి ఉంటుందని వెంటనే స్వీకరిస్తుంది. ఆ ప్రసాదాన్ని స్వీకరించిన కుమార్తె ధన్యురాలైంది. తల్లి ఇంటికి తిరిగివచ్చి జరిగినదానికి దుఃఖిస్తుంది.

చూశారా! ప్రసాదం ఫలితం ఎలా ఉంటుందో? ప్రసాదాన్ని అందుకున్నది తల్లి అయినా, దాని ఫలితాన్ని పొందలేకపోయింది. దానికి కారణం మనసులో జనించిన సంకల్పమేగా! కాబట్టి మహాత్ములు అందించిన ప్రసాదానికి ఎంత విలువ ఇవ్వాలో గ్రహించండి చాలు' అన్నారు.

## అమ్మ మాట - జపమాలా ప్రసాద

# క్షేత్రాలెన్నైనా క్షేత్రజ్ఞుడు ఒక్కడే

"భగవంతుని లీలలు అనంతం. జిహ్వాకొకరుచి అన్నట్టు, ఒక్కొక్క మానవుడికి, ఒక్కొక్క రూపం యిష్టం కనుక రూప, గుణరహితుడైన ఆ పరమాత్మ, తన భక్తుల కోర్కెలను తీర్చడం కోసం వారికిష్టమైన రూపంతోనే వారికి దర్శనమిచ్చి తరింపజేస్తాడు. కానీ సాధకుడైన వాడు, ఏదో ఒక మూర్తిపైనే తన దృష్టిని నిలిపి, ఏకైక లక్ష్యంతో సాధన చేయాలి. అనేక రూపాలమీద దృష్టిని నిలపాలని చూస్తే తన గమ్యం చేరుకోలేడు. కుండలు ఎన్నెన్ని రకాలయినా, వానిలో ప్రకాశించే ఆకాశం మాత్రం ఒక్కటే అయినట్టుగా, ఏ దేవతామూర్తిలో అయినా సరే, ప్రకాశించే ఆత్మతత్వం ఒక్కటే. క్షేత్రాలెన్నయినా, క్షేత్రజ్ఞుడు మట్టుకు ఒక్కడే, అనే నిజతత్వం మనకి తెలిపేటివారే సత్యగురుదేవులు. అట్టి గురుమూర్తిని ఆశ్రయించి, వారు బోధించినది తు.చ. తప్పకుండా ఆచరించిన గురుభక్తునికి సాధ్యం కానిదేదీ వుండదు. అందుకు గణేశుడే తార్కాణం. మూడు లోకాలనీ చుట్టి, సమస్త తీర్థాలలోనూ స్నానమాచరించి, ముందుగా తిరిగి తమ వద్దకు వచ్చిన వారికే గణాధిపత్యాన్నిస్తానని సదాశివుడు చెప్పగానే "ఓస్! ఇదెంతపని, నా నెమలి వాహనంపై ఎక్కి బలాఢ్యుడనైన నేను క్షణంలో మూడు లోకాలనీ చుట్టి వస్తానని" కుమారస్వామి రివ్వున తన నెమలినెక్కి వెళ్ళిపోయాడు.



కానీ, పాపం మరుగుజ్జు స్వరూపుడైన గణపతి "తండ్రీ! ఇది మీకు తగునా? పొట్టివాడిననీ, అన్ని విధాలా అనర్హుడననీ తెలిసీ, అందులోనూ మూషికాన్ని వాహనంగా గలవాడనని తెలిసీ, నాకీ పరీక్ష పెట్టారా స్వామీ? నాకు పునర్జన్మని ప్రసాదించి, ద్విజుడుని చేసిన నా గురుమూర్తి కూడా మీరే! కనుక మీ బిడ్డని కడతేర్చే ఉపాయం కూడా మీరే చెప్పాలి తండ్రీ!" అని ఎంతో వినయ విధేయతలతో తన తండ్రికి నమస్కరించేసరికి, ఆ సాంబశివుడు గణపతికి నారాయణ అష్టాక్షరీ మంత్రాన్ని వుపదేశించి, "నాయనా! ఈ మంత్రాన్ని జపిస్తూ, నీ తల్లిదండ్రుల చుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తే, సమస్త లోకాలనూ చుట్టివచ్చిన ఫలితం లభిస్తుంది" అని చెప్పేసరికి గణపతి, తన తండ్రీ, జగద్గురువూ అయిన పరమేశ్వరుని ఆజ్ఞని, తు.చ. తప్పకుండా

ఆచరించాడు. ఆయన తన తండ్రి చెప్పిన మాటని కించిత్ కూడా శంకించలేదు. ఇక తరువాత జరిగిన కథంతా మనకి తెలిసినదే.

కనుక గురుభక్తులకి ముఖ్యంగా వుండవలసినది తన గురుమూర్తి యందు అచంచల విశ్వాసము. ఆనాడు భక్త మీరా తన గురుదేవుడయిన రవిదాసు (రైదాసు) ఉపదేశించిన కృష్ణనామాన్ని తైలధారగా జపించి ఆ కృష్ణరూపాన్నే పొందింది. ఆవిడ పిలిచినట్టుగా ఆర్తిగా, మీరు నమ్ముకున్న దేవుడిని మనసారా పిలవండి. ఆయన తప్పకుండా వస్తాడు. ఈ ప్రపంచంలోని ఏ వస్తువూ ఇవ్వలేని ఆనందాన్ని, శాశ్వత సుఖశాంతులనీ ఆయన ప్రసాదిస్తాడు. ఆశ్రయించాలేగాని, ఆనందాన్ని మనం పొందేంత వరకూ ఆయన మనని వదలడు. ఆ భగవంతునికి మన పులిహోరలు, దధ్యోజనాలు, పళ్ళు, పూవులు అక్కరలేదు. ఆయనకి కావలసింది మన మనస్సు. కానీ ఎలాగూ మనం అవన్నీ తింటున్నాం కనుక, వాటిని ఆయనకొక్కసారి చూపించి, నివేదన చేస్తే, ఆ "సాదాన్ని" "ప్రసాదంగా" మార్చి మనకి తిరిగి యిస్తున్నాడు. "ప్రసాదే సర్వ దుఃఖానాం హాని రస్యోప జాయతే" అన్న భగవద్గీతా వాక్యానుసారం సకల దుఃఖాలని హరించి, ప్రకృష్టమైన సాధనని ప్రసాదించేదే 'ప్రసాదం'. జ్ఞాన, విజ్ఞాన యోగానుభవాన్ని ప్రసాదిస్తుందది. అట్టి దివ్య కృష్ణ ప్రసాదాన్ని నిరంతరం గ్రోలిన మీరాకి, విషం కూడా అమృతమే అయింది. కాళింగుడి విషాన్నే హరించిన ఆ శ్యామసుందరుడికి ఈ విషమొక లెక్కా? "అనన్యాశ్చింతయంతోమామ్। యేజనాః పర్యుపాసతే। తేషాం నిత్యాభియుక్తానాం। యోగక్షేమం వహామ్యహమ్। అని సెలవిచ్చాడు గీతాచార్యుడు. అన్యచింతలు లేకుండా నిరంతరం ఆ భగవంతుడినే సేవించేవారి యోగక్షేమాలన్నీ తానే స్వయంగా మోస్తానని మాటిచ్చాడాయన. బంధువులందరూ 'కులనాశిని', 'ఉన్మాదిని' అని అన్నా కూడా, చలించక రాణా పంపిన విషాన్ని కూడా నవ్వుతూ స్వీకరించిన మీరాని, ఆ ప్రభువే రక్షించుకోలేదా మరి?

భగవంతుడనేవాడున్నాడు. కాని ఆయన ఎక్కడో వైకుంఠంలోనో, మక్కాలోనో మాత్రమే లేడు. ఆయన సర్వేసర్వత్రా వున్నాడు. సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, సర్వేశ్వరుడు. ఆయన దయ వుంటే, గొడ్డలితో పోవలసింది గోటితో పోతుంది అనడానికి ఒక చిన్న కథ చెప్తాను.

మిత్రులైన ఒక భక్తుడు, ఒక నాస్తికుడు ఒకసారి షికారుకు వెళ్తూవుండగా, ఒక చోట ఒక గుడి కనిపిస్తే, భక్తుడు స్వామి దర్శనార్థం లోపలికి వెళ్ళేసరికి, అతని కాలులో ఒక ఈతముల్లు గుచ్చుకుని బాధపడుతుంటాడు. బయటనున్న అతని నాస్తికవాద మిత్రుడికొక బంగారు నాణెం దొరుకుతుంది. అప్పుడతను, తన భక్త

మిత్రుడిని "ఏరా! భగవంతుడిని నమ్ముకున్న నీకు ముల్లు గుచ్చుకుని బాధ ననుభవిస్తున్నావు! నాకేమో బంగారు కాసు దొరికింది" అని ఎద్దేవా చేస్తాడు. అది విన్న భక్తుడు బాధపడి, అటువైపే వస్తున్న ఒక సాధుపుంగవుడిని చూచి, తమకు జరిగినది చెప్పి, యిదేమి న్యాయమని అడుగగా, ఆ సాధువు తన దివ్యదృష్టితో ఒకసారి చూచి, "నాయనా! నాస్తికుడైన నీ మిత్రుడికీనాడు గొప్ప నిధి లభించవలసి వుంది. కానీ, భగవంతుడిని నమ్మని కారణాన అది ఆయనకి ఒక్క బంగారు కాసు మాత్రంగానే వచ్చింది. ఈనాడు నీకు మహా సర్పగండముంది. కానీ నీ యొక్క భక్తి నిన్ను కాపాడి, చిన్న ముల్లుతో ఆ హానినరికట్టింది!" అని చెప్పాడు.

'అస్తి' అంటే 'వుంది' అని అర్థం. ఏదేనా ఒకటి వుంది అని మనం ముందు అంటేనే గాని, 'అది లేదు' అని అనలేము. నాస్తికత్వంలోనే ఆస్తికత్వం వుంది. నాస్తికులమనుకునే రష్యా దేశస్థులే "లెనిన్'ని గురువుగా భావించి, యీ నాటికీ ఆయన దేహాన్ని భద్రపరచుకోలేదా? సత్యము, శాంతి, దయ, ప్రేమలే భగవంతుడు. వాటిని నమ్మిన ప్రతి మానవుడూ ఆస్తికుడే! అటువంటి జగన్నాధుడు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలని, అఖండైశ్వర్య భోగ, భాగ్యాలను ప్రసాదించి, సర్వులనూ కాపాడుగాక!"

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, కట్టమూరు వాస్తవ్యులు అయిన జంపని వెంకటరావు గారు 23-1-25 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 53 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన శ్రీమతి పెన్మత్స ఛాయ గారు 30-1-25 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 73 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# ఎంత ఘనుడవయ్యా!

- భాగవతుల హనుమత్ జయప్రద

గృత్సమదుడు సాధనలో లీనమై ఉన్నాడు. తన గురువుగారి ఆశ్రమంలో ఎప్పుడూ ఏకాంతంగా ఉంటూ, రాత్రింబవళ్ళు మనస్సును సాధించే అభ్యాసం చేస్తున్నాడు. ఎందుకంటే మనస్సును సాధించడమే "అసలైన సాధన" అని ఎవరో చెప్పగా విన్నాడు. ఒక రోజు అతని గురువు ఆ కుటీరంలోకి వచ్చారు. గృత్సమదుడు వారిపై ధ్యాస పెట్టలేదు. తన మనస్సులోని చిక్కుముళ్ళు విప్పుకునే ప్రయత్నం చేస్తూ ఉన్నాడు.

కృపాసాగరుడైన ఆ గురువు అక్కడే కూర్చుని ఒక ఇటుకను రాయితో రుద్దడం పెట్టడం మొదలుపెట్టారు. అలా చాలా సేపు చేస్తూనే ఉన్నారు. ఇక గృత్సమదుడు వుండబట్ట లేకపోయాడు. "మీరేం చేస్తున్నారు?" అని గురువుగారిని అడిగాడు. "నాయనా! ఈ ఇటుకను అద్దంగా మార్చాలి" అన్నారు ఆయన. ఆశ్చర్యపోయిన గృత్సమదుడు, "ఏమిటి మీరు చేసేది? జీవితాంతం రుద్దినా ఇటుక అద్దంగా మారదు" అన్నాడు.

"నాయనా! ఇటుక అద్దంగా మారలేకపోతే, మనస్సు కూడా అద్దంగా మారదు. మనస్సే అద్దాన్ని కప్పేసిన ఆ ధూళి. మనస్సంటే ఆలోచనల సంగ్రహం! అది తొలగిపోతే మిగిలిపోయే పరిశుద్ధ చైతన్యం ఎప్పటికీ పరిశుద్ధంగానే ఉంటుంది. నిర్విచారంగా ఉన్నప్పుడు, "మనస్సు" ఉన్న స్థితిలోనే సనాతనమైన సత్యం దర్శనమిస్తుంది. నిర్ద్వంద్వ తత్వాన్ని పొందాలి అంటే, నిరంతర గురుబోధ మననము, నిష్కామ కర్మ, నిత్యానుష్ఠానము మూడు ముఖ్యమైనవి" అని గురువుగారు ఉపదేశించిన మాటలతో తనను తాను ఆత్మలో విలీనం చేసుకుని ఋషిత్వాన్ని పొందాడు. ఆయనే గృత్సమద ఋషి అని పిలవబడ్డాడు.

సాధకుడు తన మనస్సు పరిధిని దాటగలగటాన్ని సాధన అంటారు. కానీ ఈ సరళమైన, సుగమమైన సత్యం అందరికీ అర్థం కాదు. మనస్సులో గందరగోళంలో ఇరుక్కుని ధ్యాస పోగొట్టుకుంటుంటారు. మనస్సు అనే చిక్కుముడి విప్పుతూ విప్పుతూ వారే అందులో ఇరుక్కుని తమ అస్తిత్వాన్నే కోల్పోతుంటారు. మనస్సే అసలైన అవరోధం, అడ్డంకి అని అనుభవజ్ఞులు చెప్తుంటారు. అది తొలగిపోయాక, చెరిగిపోయాక సత్యం అనుభవంలోకి వస్తుంది.

కనపడే దృశ్య ప్రపంచం అంతా కూడా నీళ్ళ వంటిది. మన మనస్సు పాల వంటిది. మనస్సు అనే పాలను ప్రపంచం అనే నీళ్ళలో కలిపితే రెండు ఒకటి అవుతాయి. నీళ్ళని, పాలని వేరు చేయలేము. కానీ అవే పాలని, పెరుగు చేసి, దాంట్లోంచి వెన్న తీసిన తర్వాత, ఆ వెన్న ఆ నీటిపై తేలియాడుతుంది కానీ, కలవదు. అలాగే నిజ జాగ్రత్తలో

ఉన్న సాధకుడి మనస్సు, ప్రపంచంలో ఉన్నా కూడా ప్రపంచం అంటదు. ఒక పాడిఆవు తన యజమాని, పైన చెప్పబడిన, పాల, వెన్న ఉపమానాలను ఆధ్యాత్మిక అభివృద్ధికి సంబంధించిన ఉదాహరణగా చర్చిస్తూ ఉండగా విన్నది. ఆశ్చర్యంతో యజమానిని అడిగింది, "నానుండి వచ్చే పాలు అంత ఆధ్యాత్మికమైతే, నన్ను ఒక సంత్ (మహాత్ముడిని) అని చెప్పవచ్చా?" యజమాని నవ్వుతూ చెప్పాడు, "ఖచ్చితంగా చెప్పవచ్చు, కానీ ముందుగా నువ్వు బయట దొరికే పచ్చిక గురించి వెతుక్కోవడం మానాలి! నేను పెట్టేది మాత్రమే తినాలి" అన్నాడు.

బయట దొరికే పచ్చికను (విషయాదులను) మేసేటువంటి ఆవు (మనస్సు) తన యజమాని (శ్రీ గురుదేవులు) ఇచ్చేటువంటి పచ్చిక/మేత (గురుబోధ)ను మాత్రమే ఎప్పుడైతే గ్రహించగలుగుతుందో, అప్పుడు ఆ ఆవుపాల యొక్క పోషక విలువల శాతం పెరుగుతుంది.

2007లో నేను ముంబైలో పనిచేస్తున్నప్పుడు అమ్మ (శ్రీ మాతాజీ) ముంబై రావడం జరిగింది. అమ్మ తిరుగు ప్రయాణం అవుతూ "జాగ్రత్త , ఎలా ఉంటావో ఏంటో ఒక్కదానివి" అని, హైదరాబాద్ బయలుదేరారు. ఆ తర్వాత, నాకు బెంగుళూరు ట్రాన్స్‌ఫర్ అయింది. ట్రాన్స్‌ఫర్ అయిన మూడు నెలలకు, మూడు నెలల జీతం ముందుగానే ఇచ్చి ఉద్యోగంలోంచి తీసివేశారు. వెంటనే అమ్మకి నేను ఈ విషయం చెప్పలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ మళ్ళా ఎప్పడు ఉద్యోగం వస్తుందో అని దిగులు. ఒక నెల గడిచాక, ఇంక అమ్మకి చెప్పాల్సిందే అని ఫోన్ చేస్తే, అమ్మ ఫోన్ ఎత్తగానే మొదట అన్న మాట, "నీకు ఇవాళే ఉద్యోగం పోయిందా, ఎప్పుడో పోతే ఇప్పుడు చెప్తున్నావా?" అని. అలా నా తప్పని నేను గ్రహించగలిగేలా చేశారు అమ్మ.

మహాత్ముల దగ్గర మనస్సుని దాచాలని ఎంత ప్రయత్నించినా కూడా అది సాధ్యపడదు.అప్పుడు వెంటనే అమ్మ, 'బెంగుళూరు లో ఏమి చేస్తావు, వెంటనే బయలుదేరి ఆశ్రమానికి రా' అని చెప్పి, రాగానే శ్రీ బృందావనం దీక్ష ఇచ్చి 21 రోజులు చెయ్యమన్నారు. ఆ దీక్ష పూర్తి అయ్యాక, తిరిగి వెంటనే బెంగళూరు వెళ్ళమన్నారు. వెళ్ళిన నెల రోజులలోనే మళ్ళీ ఉద్యోగం వచ్చింది. గురువులు మన గురించి మన కన్నా ఎక్కువగా ఆత్రుత చెందుతారు అనడానికి ఈ అనుభవం ఒక ఉదాహరణ. తమ యొక్క అవ్యాజమైన కరుణ ద్వారా, మన కర్మలని క్షయం చేసి, సంశయాలను రహితం చేసి, మన మనస్సుని తమ యొక్క బోధ ద్వారా కలుష రహితం చేసేవారే శ్రీ గురుదేవులు.

భిద్యతే హృదయగ్రంథిః । ఛిద్యంతే సర్వ సంశయాః
క్షీయంతే సర్వకర్మాణి । గురోః కరుణయా శివే

# విశ్వావసు

- పాలూరి కాళీప్రసాద్

శ్రీ క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రవేశిస్తున్నాం. సుందరకాండ మొదటి సర్గలో హనుమంతుడు సముద్రాన్ని దాటుతున్నప్పుడు ఆకాశం ఎలా ఉందో వర్ణిస్తూ వాల్మీకి మహర్షి 'ఈ ఆకాశం విశ్వావసుడనే గంధర్వునికి నివాస స్థాన'మని చెబుతాడు. ఈ విశ్వంలోని సమస్త జీవులకు వాటివాటికి తగ్గట్లుగా ఆవాసాలను (నివాసాలను) ఏర్పాటు చేసే బాధ్యత ఈ విశ్వావసునిది. సృష్టిలోని ప్రాణులన్నీ కూడా తమ తమ నివాసాలను స్వయంగా నిర్మించుకోవడమో, లేదా కొండగుహలు, చెట్టు తొర్రలు వంటి స్వతఃసిద్ధంగా ఏర్పడిన మరుగు ప్రదేశాలను తమ నివాసాలుగా మార్చుకోవడమో చూస్తూ ఉంటాం.

పక్షులయితే ఈ ఇల్లు కట్టుకొనే విద్యలో బహు నేర్పరులు. ఎక్కడెక్కడి పుల్లలను, గడ్డి పరకలను సేకరించి తమ పిల్లలకు సౌకర్యవంతంగానూ సురక్షితంగానూ ఉండేలా తమ గూడును ఏర్పరచుకుంటాయి. గిజిగాని గూడు గురించి మనందరం చిన్నప్పుడు చదువుకున్నాం కదా! కొన్ని పక్షులయితే తాము లోపలికి వెళ్ళడానికి ఒక రహస్య ద్వారాన్ని నిర్మించి, పాములవంటి శత్రువులను మోసం చేయడానికి మాయా ద్వారాన్ని కూడా నిర్మిస్తాయి. మనిషికి కూడా తప్పనిసరిగా కావలసిన వాటిగా కూడు, గూడు, గుడ్డ ఈ మూడింటినీ చెబుతారు కదా! అవి లేనివారికి ప్రభుత్వాలు వాటిని అందిస్తూ దానికి తమ నాయకుల పేర్లో, తల్లిదండ్రుల పేర్లో పెడుతూ ఉంటాయి. ఒకప్పుడు మనుషులు అందరూ కూడా తమ నివాసానికి కావలసినట్లుగా పర్ణశాలలను తామే నిర్మించుకొనేవారు. వనవాస కాలంలో శ్రీరాముడు, అలాగే పాండవులు కూడా తమ నివాసాలను నిర్మించుకోవడం మనం చూస్తాం.

అయితే క్రమేపీ అవసరాలు వెనుకబడి, ఆశలకు పెద్దపీట వేయడం, అవసరానికి మించి సంపాదించి తరతరాలకు దాచుకోవడం మొదలుపెట్టడంతో పెద్దపెద్ద ఇళ్ళు కట్టుకోవడం మొదలుపెట్టి మనిషి ఆ ఇంటి నిర్మాణానికి వేరొకరిమీద ఆధారపడవలసి వస్తోంది. ఎంత

సంపాదించినా, కూడబెట్టినా, ఎంత పెద్ద రాజభవనాన్ని నిర్మించుకొన్నా చివరికి వట్టి చేతులతో మట్టిపాలు కావలసిందే. 'ఈ భూమికి నేను యజమానిని' అని విర్రవీగే వానిని చూసి భూమి నవ్వుకుంటుందిట 'నీలాంటి వారిని ఎంతమందిని నాలో కలిపేసుకున్నానో! ఇదే భూమికి నేను యజమానినని ఇప్పటికి ఎంతమంది విర్రవీగి చివరికి నాలో కలిసిపోయారో' అని.

అయితే మనకు నిజమైన నివాసం ఏది? అని ఆలోచిస్తే **'ఈశావాస్యమిదగ్ం సర్వం'** అని ఉపనిషత్తు చెబుతోంది. ఈ జగత్తు అంతా ఈశ్వరునికి ఆవాసమై ఉన్నది. మరి జగత్తుకి ఆవాసం ఏది? అంటే అది ఈశ్వరుడే. ఎందుకంటే జగత్తు ఈశ్వరునికి భిన్నంగా లేదు. సముద్రంలో అనేక కెరటాలు పుట్టి, కొంతదూరం ప్రయాణించి మళ్ళీ అందులోనే లీనమైపోతూ ఉంటాయి. కెరటంగా కనిపించినంత సేపూ అందులో ఉండే నీటికి ఆ కెరటం ఆధారమైనట్లుగా మనకు తోస్తుంది. కానీ ఆ కెరటానికి ఆధారం కూడా విశాలమైన సముద్రమే కదా! నిజానికి సముద్రం లేకుండా కెరటానికి ఉనికి లేదు. కెరటం తయారైంది కూడా ఆ సముద్రపు నీటితోనే. కొంతసేపు అది సముద్రానికి వేరుగా ఉన్నట్లుగా భ్రమింపజేస్తూ చివరికి తన స్వస్వరూపంలో లయం అయిపోతోంది.

అలాగే పరమాత్మ తనలోనుండే పంచభూతాలను సృష్టించి వాటితో ఈ సమస్త ప్రాణులను తయారు చేశాడు. కుమ్మరి తనకంటే వేరుగానున్న మట్టిని తీసుకొని దానితో కుండలు చేసినట్లుగా పరమాత్మ సృష్టి చేయాలంటే తనకన్నా వేరైనది ఏదీ లేనేలేదు కదా! కాబట్టి విశ్వానికంతటికీ నిజమైన ఆవాసం పరమాత్మ. అదే పరమాత్మ విశ్వంలోని ప్రాణులన్నింటి దేహాలను తన ఆవాసాలుగా చేసుకొని వాటిని ప్రకాశింపజేస్తున్నాడు. ఈ సత్యాన్ని గుర్తెరిగి మన పాంచభౌతిక దేహాలను ఆ పరమాత్మ నివాసానికి యోగ్యమైన దేవాలయాలుగా స్వచ్ఛంగా, నిర్మలంగా మలచుకొని నిజమైన శాంతిని, ఆనందాన్ని పొందేందుకు ప్రయత్నిద్దాం.

# కర్మఫలం-పుణ్యఫలం-పూజాఫలం-రాశిఫలం

- పెనుమాక నాగేశ్వరరావు

ఇటీవలకాలంలో యూ ట్యూబులు, వాట్సయాపులు విరివిగా చలామణిలో ఉంటున్న కారణంగా ఈ కర్మఫలం వదిలిపెట్టదు వెన్నంటి వెంటాడుతుంది. అనుభవించి తీరాల్సిందే! ఇలాంటి హెచ్చరికలు తరచుగా కనిపిస్తూ మనల్ని ఆలోచనలో పడేస్తున్నాయి. నిజానికి ఇవి కొత్తవి కావు. కానీ ఆ పుస్తకాల జోలికి పోనివారికి కూడా ఇలాంటి వాక్యాలను పరిచయం చేస్తున్నాయి ఈ మాధ్యమాలు. మంచి కర్మలు చేస్తే మంచి ఫలితాలు పొందుతావు. చెడు కర్మలు చేస్తే చెడు ఫలితాలు పొందుతావు అనేది సారాంశం. ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు అని ప్రశ్నించటం మనకెరుకే. బుద్ధి కర్మానుసారణి అనేది ధార్మిక ప్రపంచంలో వినిపించే మాట. కర్మను బట్టి బుద్ధులు పుడుతుంటాయి అన్నారు. అలా బుద్ధి పుట్టించేది మళ్ళీ భగవంతుడే .

దాచిపెట్టిన ధనం పరులపాలు. అందమైన దేహం అగ్గిపాలు. అస్తికలన్నీ గంగపాలు. కొడుకు పెట్టిన తద్దినం కూడు కాకులపాలు. నీవు ఇష్టంగా వాడిన వస్తువులు ఎవరిపాలో? కానీ నువ్వు చేసిన దాన, ధర్మాల పుణ్యఫలం మాత్రమే నీ పాలు అని భగవానుని ఉవాచ. అయితే కుడిచేతితో ఇచ్చిన దానం ఎడమ చేతికి తెలియకూడదు అనేది షరతు. ఆడంబరంగా, పేరుకోసమో, మెప్పుకోసమో, స్వలాభం కోసమో చేసే దానాలు ఈ కోవలోకి రావు అనేది నిర్వివాదాంశం. క్విడ్ ప్రొ కో లు చెల్లవని సారాంశం. అయితే ఇక్కడ తనకుమాలిన ధర్మం పనికిరాదంటూ మరో తిరకాసు పెట్టారు. లోగుట్టు పెరుమాళ్ళకెరుక! మొత్తం మీద ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే దానధర్మాలకే పుణ్యఫలితం ఉంటుందనేది భావం.

ఎవరెవరి నోములకెంతంత ఫలమో తులతూచి ఇచ్చేటి తల్లి అని పాడుకుంటున్నాం. మరీ అంత తూచి తూచి ఇవ్వకపోయినా, పిండికొద్దీ రొట్టె అనేది దాగివున్న రహస్యం. నోములు, వ్రతాలు చేయటం ఫలితాలను ఆశించే, అందుకు సందేహం లేదు. కానీ అవి భక్తిగా నమ్మకంగా చేయాలని తాత్పర్యం. పూజలు, వ్రతాలు చేసినంత మాత్రాన దేవుడు మనకి ఏమీ ఇవ్వడు. మనకి ఎప్పుడు ఏది ఇవ్వాలో ఆయనకు బాగా తెలుసు. కాబట్టి నీకు ఎప్పుడు ఏది అవసరమో, ఎంత అవసరమో తెలిసిన భగవంతుడు ఆ లెక్క ప్రకారం నీకు అందిస్తాడు కానీ నీ పూజలను బట్టి కాదు అని చెబుతున్నారు విజ్ఞులు.

పైగా భార్యాభర్తల పూజాఫలాల విషయానికి వస్తే, భర్త చేసిన పూజా ఫలితంలో భార్యకు సగం వాటా వుంటుందని చెబుతూనే, భార్య చేసిన పూజాఫలంలో మాత్రం భర్తకు ఎటువంటి భాగం ఉండదంటున్నారు. ఈ లెక్కలు మనకు అంతుబట్టవు. నేను తింటే నీ కడుపు నిండుతుందా అనే లాజిక్కు ఇక్కడ వర్తించదేమో మరి! అది బ్రహ్మ రహస్యమో, చిదంబర రహస్యమో అనుకోవాల్సిందే సామాన్యులు.

'ఒరులేయవి ఒనరించిన ..............' దీనికి మించిన ధర్మం లేదని చెబుతుంటే మనలో చాలామంది ఎవరి వల్ల మనకి ఇబ్బంది కలిగిందో, వారికి ఎట్లా బుద్ధిచెప్పాలో, ఎప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలో అనే ఎదురు చూస్తుంటాము. 'డు యాజ్ యు డన్ బై' అనే ఆంగ్ల సామెతనే అనుసరిస్తుంటాం. 'కుక్క కాటుకు చెప్పుదెబ్బ' అని మనకు మనమే సమర్ధించుకుంటుంటాం. అంతేకానీ 'ఉపకారికి ఉపకారము విపరీతము కాదు సేయ...అపకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ' అనే సూక్తిని అనుసరించగలిగిన వాళ్ళను ఎంతమందిని చూడగలం?

అహంకారం, మమకారం వదిలేయమని చెబుతున్నారు మహానుభావులు. మమకారాన్నయినా కొద్దిగా మరుగున పడేస్తున్నామేమో కానీ, అహంకారాన్ని అరనిముషం కూడా విడిచి ఉండలేకపోతున్నాం. దానికి ఆత్మగౌరవం అని, ఆత్మాభిమానం అనీ అందమైన పేరు పెట్టుకుని మనల్ని మనమే మోసం చేసుకుంటున్నాం.

ఆడంబరంగా కనిపించటం, వినిపించటం, అహంకారం కాకపోవచ్చు. వున్నది పుష్టి మానవులకు, తిన్నది పుష్టి పశుసంపదకూన్ ...అని చెప్పారు నీతిశాస్త్రకారులు. ఉన్నదాన్ని సద్వినియోగం చేసుకోమని చెబుతున్నారు మహాత్ములు. 'ఉన్నదాన్ని' అంటే కేవలం సంపదని మాత్రమే కాదు, కాలాన్ని కూడా. సంపద కంటే కాలం విలువైనదని కూడా హితం పలుకుతున్నారు. పోయిన సంపదనైనా తిరిగి పొందగలమేమో కానీ, కాలాన్ని తిరిగి పొందటం అసాధ్యం అనేది జగద్విదితమే కదా.

కర్మఫలాలు, పుణ్యఫలాలు, పూజాఫలాలు యాంత్రికంగా చేస్తూ రాశిఫలాలు వారం, వారం వెతుక్కుంటే ఏం ఉపయోగం! గాలికి పోయిన పేలపిండిని కాకుండా, సర్వం కృష్ణార్పణం అని చిత్తశుద్ధిగా అనుకోవటం శుభప్రదం. అలా అనుకోగలిగిన మనోస్థైర్యాన్ని అనుగ్రహించవలసిందిగా గురుమూర్తిని వేడుకుందాం.

## భీమవరం శాఖ ప్రారంభోత్సవ ఆహ్వానము

**శ్రీ సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి పరమానుగ్రహముతో, శ్రీ కాళీ వనాశ్రమ పీఠాధిపతులు పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ వారి దివ్యాశీస్సులతోను శ్రీ కాళీ వనాశ్రమ భీమవరం శాఖ ప్రారంభోత్సవ ఆహ్వానము.**

శ్రీ సద్గురు లక్ష్మీ నారాయణ నక్షత్రేష్ఠి విశ్వశాంతి మహాయాగము; అఖండ హరినామ సంకీర్తన సప్తాహము, త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళనము.

ది.12.03.2025 బుధవారం ఆశ్రమ ప్రవేశం; ది.17.03.2025 సోమవారం మూర్తి ప్రతిష్ఠ, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ, లక్ష్మీ గణపతి, శ్రీ కాళికాపరమేశ్వరీ రామ లింగేశ్వర, ప్రణవ స్థిత శ్రీ రాధా కృష్ణ పరివార దేవతల క్షీర శిలా మూర్తుల సహిత శ్రీ సద్గురు అభయ క్షీర శిలా మూర్తి పాంచాహ్నిక ప్రతిష్ఠా మహోత్సవము జరుపుకొనుటకు దైవజ్ఞులు సుమహూర్తము నిశ్చయించినారు.

ది.12.03.2025 బుధవారం ఉదయం 10.42 గం.లకు వృషభ లగ్నమందు భీమవరం శ్రీకాళీవనాశ్రమ శాఖ శ్రీ సద్గురు బృందావనము మరియు భక్తుల వసతి గృహ ప్రవేశము, ది.17.03.2025 సోమవారం ఉదయం 10.22 గం.లకు చిత్తా నక్షత్ర యుక్త వృషభ లగ్నమందు మూర్తుల ప్రతిష్ఠ "శ్రీ సద్గురు లక్ష్మీ నారాయణ నక్షత్రేష్ఠి విశ్వశాంతి మహా యాగము" పాంచాహ్నిక దీక్షతో జరుప నిశ్చయించినారు.

**నిత్య కార్యక్రమాలు**

1. ది.12.03.2025 నుండి ది.19.03.2025 వరకు శ్రీ వీరభద్ర శివాజీ గారి ఆధ్వర్యములో, శ్రీ అవధూతేంద్ర భక్త మండలి వారిచే అఖండ హరినామ సంకీర్తన జరుగును.
2. ది.13.03.2025 గురువారం నుండి ది.17.03.2025 సోమవారం వరకు ఉ.4గం.లకు మేలుకొలుపు, సుప్రభాతము, 5గం.లకు ప్రార్థన. 6గం.లకు వేద పండితులచే వేద స్వస్తి, 7గం.ల నుండి వేద పండితులచే పారాయణలు, హోమములు.
3. ది.13.03.2025 గురువారం నుండి ది.16.03.2025 ఆదివారం వరకు ప్రతిరోజు ఉ. 8 గం.ల నుండి 11. గం.ల వరకు శ్రీ శ్రీనివాస రామానుజ దాసుగారి ప్రవచనము, సత్సంగము, పూ.జ్య శ్రీ మాతాజీ వారి అనుగ్రహ భాషణము.
4. ది.13.03.2025 గురువారం నుండి ది. 16.03.2025 ఆదివారం వరకు ఉ.11 గం.లకు సామూహిక పూజలు. తదనంతరం తీర్థ ప్రసాద వినియోగము.
5. 13 గురువారం నుండి17 వరకు12గం.ల నుండి 2గం.ల వరకు భక్త సమారాధన.
6. 13 నుండి 16 వరకు 3గం.ల నుండి 5.30 గం.ల వరకు హోమము తదుపరి అధివాసములు.
7. 14 నుండి 16 వరకు ఉ. 8గం. నుండి 11గం. వరకు మరియు సా. 4.30 ల నుండి 7గం.ల వరకు (14, 15 తేదీలలో) సాధుమహాత్ముల అభిభాషణములు.
8. 13 నుండి 16 వరకు రాత్రి 7.30 గం.ల వరకు హారతి, దర్బారు, తీర్థ ప్రసాద వినియోగము.

9. 13 నుండి 17 వరకు ప్రతి నిత్యము, మండప పూజలు, వేద పారాయణ, సూర్య నమస్కారములు, లక్ష్మీ గణపతి జపం, లింగార్చన, నక్షత్ర జపం, నవగ్రహ జపం, సుందరకాండ పారాయణ జరుగును.

**ప్రత్యేక కార్యక్రమములు**

1. 12 బుధవారం ఉదయం 10 గం.లకు గోపూజ, 10.42 గం.లకు ఆశ్రమ ప్రవేశము. గణపతి పూజ, పుణ్యాహ వచనము, యాగ సంకల్పము, రక్షా బంధన ధారణ, అఖండ హరినామ సంకీర్తన. మధ్యాహ్నం 12 గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, తీర్థ ప్రసాద వినియోగము, భక్త సమారాధన.

2. 14 శుక్రవారం రాత్రి 8 గం.లకు శ్రీమతి నారాయణి, శ్రీమతి సావిత్రి గార్లచే సంగీత కచేరి.

3. 15 శనివారం రాత్రి 8 గం.లకు శ్రీమతి సావిత్రి భాగవతి గారిచే లక్ష్మీనారాయణ కళ్యాణము హరికథా గానం.

4.16 ఆదివారం రాత్రి 8గం.లకు ఆశ్రమ బాల బాలికలచే నృత్య ప్రదర్శన.

5. 17 సోమవారం ఉ. 8 గం.ల నుండి 9 గం.ల వరకు శ్రీ శ్రీనివాస రామానుజ దాసు గారిచే ప్రవచనం, ఉ.10.22గం.లకు శ్రీ సద్గురుమూర్తి, దేవతా మూర్తుల ప్రతిష్ఠ శ్రీ సద్గురు సహస్ర నామార్చన, భక్త సమారాధన, సా.6 గం.లకు శ్రీసీతారామ. మరియు శ్రీపార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, నవహారతులు, మహా మంగళ హారతి.

**విశేష కార్యక్రమములు**

1. ది.13 గురువారం ఉ.11గం.లకు సామూహిక శ్రీ విఘ్నేశ్వర దత్తాత్రేయ సద్గురు పాద పూజ. సా. 4 గం.లకు గణపతియాగం, ప్రతిష్ఠామూర్తుల జలాధివాసం.

2. 14 శుక్రవారం ఉ.11గం.లకు సామూహిక కుంకుమ పూజలు. సా. 4గం.లకు లక్ష్మీ యాగం, ప్రతిష్ఠామూర్తుల క్షీరాధివాసం.

3. 15 శనివారం ఉ.11గం.లకు సామూహిక శ్రీ రమాసత్యన్నారాయణ స్వామి వారి వ్రతములు. సా.4గం.లకు శ్రీలక్ష్మీ నారాయణ యాగం, నవగ్రహ హోమం, ప్రతిష్ఠామూర్తుల పుష్పాధివాసం.

4. 16 ఆదివారం ఉ.11 గం.లకు సామూహిక శ్రీ కాళికా పరమేశ్వరీ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకములు, నక్షత్ర హోమం, ప్రతిష్ఠామూర్తుల ధాన్యాధివాసం మరియు శయ్యాధివాసం.

**ముఖ్య గమనిక**

ది.16న వివాహ ముహూర్తములు, ది.17న ఉపనయన ముహూర్తములు కలవు. ఆసక్తి ఉన్నవారు కార్య నిర్వాహకులను సంప్రదించవలెను.

వివరములకు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వరప్రసాదబాబు ట్రస్ట్, జంట కాలువల వద్ద, ఉండిరోడ్డు, భీమవరం-534202, సెల్ నంబర్లు 9397979911, 9393834345, 9618199556, 7013700549

# సద్గురు సేవ

ఎన్. కుట్టీ

సద్గురు సేవ చేయడం వలన శోకం నశిస్తుంది. అజ్ఞానం తొలగి జ్ఞానం కలుగుతుంది. ద్వంద్వం నశించి, ఉన్నది ఒక్కటే అని తెలుస్తుంది. గురు అనుగ్రహం, మరియు గురు సేవ పొందాలంటే చతుర్విధ శుశ్రూషలు ఆచరించాలి. అవి స్థాన శుశ్రూష, అంగశుశ్రూష, భావ శుశ్రూష మరియు ఆత్మశుశ్రూషలు ఆచరించాలి. ఎల్లవేళలా గురుదేవుని నామాన్ని స్మరించాలి. గురుమూర్తినే ఆరాధించాలి. వారి ఆజ్ఞను పాటించాలి. గురుదేవుని కంటే మనస్సులో అన్యమును రానీయకూడదు. ఉండేది ఒక్కడే అనే విశ్వాసాన్ని దృఢపరచుకోవాలి.

ఆత్మను తెలుసుకోవాలనుకునే జిజ్ఞాసపరులు కీర్తిప్రతిష్ఠలను, ధనధాన్యాదుల పైన ఆశను త్యజించి, గురుదేవుల ఆజ్ఞను తు.చ. తప్పకుండా పాటించి, వారి సేవ చేసుకుని వారి అనుగ్రహాన్ని పొందాలి. అప్పుడు గురుదేవులు 'నేనుండగా నీకు భయమేలరా?' అంటారు. యోగినీ శ్రీ చంద్రకాళీప్రసాదమాతాజీ వారు తమ బోధలో 'గురుతు తెలిపేవారే గురుదేవులు' అన్నారు. పరమాత్మను తెలుసుకోవడానికి గురుసేవ ఒక్కటే మార్గము. ఇది సాధ్యం కావాలంటే ఎల్లప్పుడూ గురుచింతనే చేస్తూ వుండాలి. అప్పుడు గురువు ఒక్కడే అన్న సత్యము బోధ పడుతుంది. భవరోగాన్ని తొలగించేవాడు కనుక ఆయనను గురువు అన్నారు. గురువు అంటే అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించేవారని అర్థము. మరొక అర్థమేమిటంటే గు అంటే గుణాతీతుడు, రు అంటే రూపాతీతుడు అని అర్థము. గురవు అన్న పదమే ఉత్తమమైనది.

శ్రీగురుదేవులను తను, మన, ధనములతో నిష్కామ భక్తితో సేవించాలి. గురుసేవ లభించాలంటే దేహాభిమానం వదలివేయాలి. గురుదేవునకు సర్వసమర్పణ చేసినప్పుడే జీవాత్మకు, పరమాత్మకు మధ్య వున్న మాయ తొలగిపోతుంది.

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

## ప్రథమోధ్యాయము - అర్జున విషాదయోగము

ఆసక్తి వ్యక్తులను ఎంతగా మార్చగలదో, దీనిని చూచి నీవు అర్థం చేసుకోవాలి. అర్జునుడంతటి మహావీరుడికే, ఆసక్తి వలన అటువంటి గతి పట్టింది అంటే, ఇక నీ సంగతి ఏమిటో ఊహించు.



"శరీరమున వేపధువు తోస్తున్నది. శతసహస్ర ధనుస్సమాన పటిష్ఠము, అరివీర భయంకరము, అగ్నిదేవ ప్రసాదితము అయిన గాండీవాన్ని, చేతితో కనీసం పట్టుకోలేకపోతున్నాను. నా తల తిరుగుతున్నది" అని అర్జునుడు విషాదంతో అన్నాడు అంటే, ఆ విషాదం ఎంత తీవ్రమైనదో, ఆ ఆసక్తి ఎంత గాఢమైనదో దానికి ఎంత శక్తి ఉన్నదో నీవే ఊహించు.

**31.** **నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ!**
**న చ శ్రేయోఽ నుపశ్యామి హత్వా స్వజన మాహవే ॥**

**32.** **న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖాని చ**
**కిం నో రాజ్యేన గోవింద! కిం భోగై ర్జీవితేన వా ॥**

**33.** **యేషా మర్థే కాంక్షితం నో రాజ్యం భోగాస్సుఖాని చ**
**త ఇమేఽ వస్థితా యుద్ధే ప్రాణం స్త్యక్త్వా ధనాని చ॥**

**34.** **ఆచార్యాః పితరః పుత్రాః తథైవ చ పితామహాః**
**మాతులా శ్శ్వశురాః పౌత్రా స్స్యాలాస్సంబంధిన స్తథా ॥**

**35.** **ఏతాన్న హంతు మిచ్ఛామి ఘ్నతోఽ పి మధుసూదన !**
**అపి త్రైలోక్య రాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥**

అత్యంత ఉన్నతమైన నీ లక్ష్యాన్ని గురించి, దాన్ని సాధించటానికి అవసరమైన సాధనకు సంబంధించిన అంశాలను గురించి తెలుసుకొని ఉండటం ఎలా అవసరమో, అలాగే ఆసక్తి విషయంలో అత్యంత జాగరూకత వహించటం కూడా అవసరం. ఎందుకంటే, ఆ ఆసక్తికి ఏ విధమైన అఘాతం ఏర్పడినా అది అత్యంత తీవ్రమైన శోకంగా

మారుతుంది. అది అన్ని విలువలను తారుమారు చేస్తుంది. ఒక్కక్షణం క్రితమే దుష్ట దుర్యోధనుడు అన్న అర్జునుడు "నాకు వీరందరూ స్వజనులు, వీరందరి శ్రేయస్సునే నేను కోరుతున్నాను, వీరితో నేను యుద్ధం ఎలా చేసేది?" అనేలా అతడిని మార్చివేసింది అంటే ఆ ఆసక్తి పట్ల నీవు ఎంత జాగ్రత్తగా ఉండాలో ఆలోచించు. వీళ్ళందరూ రణరంగంలో వుంటారని, వీరందరితో తను యుద్ధం చేయవలసి ఉంటుందని అర్జునుడికి ముందే తెలుసు. అసలు వాళ్ళతో యుద్ధం చేయటానికే అతడు యుద్ధభూమికి వచ్చాడు. అయినా ఇంతలోనే "వీరందరూ స్వజనులు వీరితో యుద్ధం ఎలా చేసేది?" అన్నాడు అంటే అర్జునుడి విలువలు ఎలా మారి పోయాయో గమనించు. కొద్ది క్షణాల క్రితం ధర్మంగా అనిపించినది, ఆసక్తి మూలంగా ఇప్పుడు అధర్మంగా అనిపిస్తున్నది. పదునెనిమిది అక్షౌహిణుల సైన్యం అంటే ఎంత లేదన్నా పదునెనిమిది లక్షల సైన్యం వుంటుంది. వీళ్ళందరిలో అర్జునుడికి శత్రువులే కనపడలేదు. అంతా స్వజనంగా కనిపిస్తున్నారు. ఆ స్థితిలో అర్జునుడు "శ్రీ కృష్ణా! అన్నీ అప శకునాలు కనిపిస్తున్నాయి. బంధువులను చంపినందువలన వచ్చే విజయం నాకు అక్కరలేదు. అలా వచ్చే రాజ్య సుఖములతో నాకు నిమిత్తం లేదు. గోవిందా! బంధువులందరు మరణించిన తరువాత నాకీ రాజ్యమెందుకు? భోగము లెందుకు? జీవితము మాత్రము ఎందుకు? ఎవరిని గురించి నేను ఈ రాజ్యమును, సుఖములను, భోగములను కావాలి అని కోరుకున్నానో, ఆ గురువులు, తాతలు, తండ్రులు, కొడుకులు, మనుమలు, మేనమామలు, బావలు, మరదులు, మొదలైన బంధువులే తనువుల మీద ప్రేమను వీడి, ధనములను వదలి, చివరకు ప్రాణములకు కూడా తెగించి, యుద్ధము చేయటానికి వచ్చారు. మధుసూదనా! వారే అన్ని ఆయుధములు ధరించి వచ్చి నన్ను చంపినా సరే, కానీ త్రిలోకాధిపత్యం లభిస్తుంది అన్నా కూడా నేను వారిని చంపను. అటువంటిది ఈ స్వల్పమైన భూమికోసం, అల్పమైన రాజ్యాధిపత్యం కోసం, వారిని చంపటం అనేది జరగని పని" అన్నాడు.

- సశేషం

# శ్రీ గురుపద ప్రహేళిక

- భాగవతుల హనుమత్ జయప్రద

**అడ్డం**

1. శ్రీ బాబూజీ ప్రసాదించిన త్రయోదశాక్షరి మహా మంత్రం

4. భక్తుడు తన ఆరాధ్యదేవుని రూపాన్ని పొందే మోక్ష స్థితి (సూచన: శివానందలహరి) -(3)

6. శ్రీ మాతాజీ తరచుగా బోధించే "ఉత్తిష్ఠత, జాగ్రత , ప్రాప్యవరాన్నిబోధత" ఏ ఉపనిషత్తు లోనిది (6)?

7. అయం వ్యర్థో బాహ్యహ కోపీన (3)

8. బోయవాడు రామ నామాన్ని ఏమని పలికాడు (2) ?

10. పురుషుడి చేతిలో మరణం కలుగకుండా వరం పొందిన రాక్షసుడు ఎవరు (4)?

11. కారణ___మకారణం పరబ్రహ్మాం(3)

12. ముఖం పద్మదళాకారం వర్చస్సు __శీతలం (3)

13. శ్రీ రామచరితమానస్‌ను రచించినది ఎవరు (5)?

**నిలువు**

2. ___ త్రాయతే ఇతి మంత్రః (4)

3. హృదయమే శివమందిరమని మొదలు తెలియవే __(3)

5. శ్రీ బాబూజీ ఒకే రాజు కాశీలోను, రామేశ్వరంలోను అభిషేకం చేసిన విషయం తెలిసిన వారు ముగ్గురు - చిరంజీవి రాజుగారు, డా.సోమయ్య గారు, మూడో వ్యక్తి ఎవరు (8)?

6. మూకం __ వాచాలం (3)

7. వాల్మీకి మహర్షితో ఉన్న శిష్యుని పేరు ఏమిటి (4)?

9. సౌందర్యలహరి 22 వ శ్లోకం లో అమ్మవారి ఏ నామము చెప్పబడినది ?

11. శ్రీ రాముని జన్మ నక్షత్రం ఏమిటి (4)?




## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మార్చి 2025 :*** AS 7685, 7687, 8523, 8527, 8528, 8529, 8530, 8533, 8534, 9279, PK 0078, 0080, 0081, 0082, 0083, 0084, 0086, 0088, 0091, 0093

***ఏప్రియల్ 2025 :*** AS 7103, 7105, 7106, 7896, 8032, 8792, 9213, 9282, PK 0094, 0095,

# పరిప్రశ్నేన సేవయా -కీ.శే. పరాశర ప్రసాద్

సద్గురుమూర్తితో కడు జాగరూకతతో సంచరించాలి. ముఖ్యంగా వారితో చేసే సంభాషణ వినయవిధేయతలతో కూడినదై ఉండాలి. కాని ఒక్కొక్క సారి శబ్ద దోషం సంభవిస్తుంది. కాని ప్రేమస్వరూపుడైన సద్గురుదేవులు శిష్యుని హెచ్చరించి, తప్పుని సరిదిద్దుకునే విధంగా బోధను అందించేవారు.

ప్రతిరోజూ ఉదయంగాని, మధ్యాహ్నంగాని, సాయంత్రంగాని సద్గురు దేవులతో సద్గోష్ఠి ఉండేది. దానికి ఒక నియమితమైన కాలం ఉండేదికాదు. సమయానికై ఎదురు చూడాలి. స్వాతి చినుకు కోసం ఎదురు చూసే ముత్యపు చిప్పలాగ మేమంతా ఎప్పుడు సద్గోష్ఠి జరుగుతుందా అని ఆవేదనతో ఎదురు చూసేవాళ్ళం. ఆ రోజు సాయం సమయం అటువంటి సదవకాశం మాకు లభించింది.

మేమంతా సద్గురుమూర్తి సన్నిధికి చేరగానే "ఉదయం నుండి ఏం చేస్తున్నారయ్యా?" అని ఒక భక్తుణ్ణి ప్రశ్నించారు బాబు. అడిగిన భక్తుడుకాక, వేరొక భక్తుడు సమాధానం చెబుతూ 'ఇంట్లోనే ఉన్నామండీ' అని సమాధానం చెప్పాడు. అది విన్న సద్గురుదేవులు "అయితే నాదే పొరపాటన్నమాట. నేనే మిమ్మల్ని సద్గోష్ఠికి రమ్మని పిలవవలసింది" అన్నారు. "అంతేకాదు. ఎవరిని ప్రశ్నిస్తే వారే సమాధానం చెప్పడం నేర్చుకోండి. అడగనివారు సమాధానం చెబితే ఏమవుతుందో తెలుసా? హనుమంతుడి కథ తెలుసా! శ్రీకృష్ణపరమాత్మ అర్జునునికి రథసారథిగా ఉన్నప్పుడు యుద్ధభూమిలో భగవద్గీత బోధిస్తూ అర్జునుడిని ప్రశ్నించాడు. అర్జునుడు సమాధానం చెప్పలేదు. అర్జునుడి రథంపైన గల జండాపై కపిరాజు అంటే హనుమంతుడు దిగివచ్చి, శ్రీకృష్ణభగవానుడికి నమస్కరించి, 'ప్రభూ! మీరడిగిన ప్రశ్నకు నేను సమాధానం చెప్పనా?' అని అడిగాడు. దానికి కృష్ణపరమాత్మ 'నిన్ను అడగని దానికి సమాధానం చెప్పటానికి వచ్చావు కాబట్టి ఇకముందు ఇటువంటి అవకాశం లేకుండా, మానవులెవ్వరూ నిన్ను గుర్తించకుండా, వారి ముందు పిశాచ రూపము ధరించుగాక!' అని శపించాడు శ్రీకృష్ణుడు. 'అంతేకాదు పిశాచభాషలో భగవద్గీత రచించి, శాపగ్రస్తులైనవారు, యోగభ్రష్టులైనవారు ఎవరైనా పిశాచ జన్మఎత్తినవారు నీచేత బోధింపబడిన గీతాశ్రవణంచేసి, శాంతిని పొంది, శాప విముక్తిని పొందెదరుగాక!' అన్నారు.

"ఇది శాపమా? వరమా? చూశారా! నారాయణమూర్తి దగ్గర ఎంత వినయ విధేయతలతో ఉండాలో. అది పూర్వకాలం. ఈ రోజులలో అయితే శిష్యుడు చెప్పినట్లు గురుమూర్తి నడుచుకోవాలి. లేకపోతే శిష్యుడు సద్గురుమూర్తికి దూరం అయిపోతాడు. దాని పర్యవసానం వారికేం తెలుసు?" అన్నారు శ్రీబాబు.

# బిల్వదళం - మోక్షఫలం

సేకరణ - మురళీ

(గత సంచిక తరువాయి)

పురంధరా నీకు ఏమి కావలో చెప్పు ఇప్పిస్తాను అన్నారు స్వామివారు. వాడు రెండు చెంపలు వేసుకున్నాడు. "స్వామీ! మీ వద్ద లౌకికమైన విషయాలు కోరడమా! మా నాన్న ఇవన్నీ క్షణ భంగురాలని చెప్పేవాడు. అయితే నాకు రెండు కోరికలు ఉన్నాయి స్వామి! మీరు అనుగ్రహిస్తే ఒకటి ఇప్పుడు అడుగుతాను, రెండవది మీరు ఈ ఊరినుండి వెళ్లేటప్పుడు అడుగుతాను" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాడు. స్వామి వారు వాడిని బుజ్జగించి చెప్పు నీ కోరికేమిటో అన్నారు.

"ఏం లేదు స్వామి మా నాన్న నాకు పురంధరదాసు కృతులు, త్యాగరాజ కృతులు నేర్పాడు, నేను ఆవుల దగ్గర పని చేస్తూ ఒంటరిగా పాడుకుంటూంటాను. ఒక్కసారి మీ ఎదురుగా పాడలని ఉంది స్వామి" అన్నాడు. స్వామివారికి ఆ కోరిక విని చాలా ఆనందం వేసింది.

"తప్పకుండా! నేనే కాదు అందరమూ వింటాము. నేనున్నన్ని రోజులూ సాయంత్రం మూడు గంటలకి ఇక్కడకి వచ్చి పాడు. అమ్మవారు అయ్యవారు (త్రిపురసుందరీ చంద్రమౌళీశ్వరులు) కూడా విని నిన్ను అనుగ్రహిస్తారు" అన్నారు.

పురంధరకేశవుల ఆనందానికి అంతే లేదు. "సరి నీ రెండో కోరిక ఏమి?" అన్నారు స్వామివారు. నవ్వుతూ "అది మీరు వెళ్ళిపోయేటప్పుడు కోరతాను" అన్నాడు అతను.

స్వామివారు తమ మెడలో ఉన్న తులసి మాలను అనుగ్రహించారు. ఎంతో అపురూపంగా కనులకు అద్దుకుని గంతులేసాడు పురంధరకేశవులు. ఆ ఊళ్ళో స్వామి వారు ఇరవైఒక్క రోజులు ఉన్నారు. వెళ్ళిపోయే రోజు వచ్చింది. ఊరు ఊరంతా విరిగిపడినట్లు వచ్చారు జనాలు. అందరినీ ఆశీర్వదించి నిదానంగా ముందుకు సాగారు స్వామివారు. గ్రామప్రజలందరి కళ్లలో నీరు. ఏదో కోల్పోతున్న భావన. అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా వెనక్కి తిరిగి చూశారు మహాస్వామి. దూరంగా పందిరి గుంజకు చుట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ పురంధరకేశవులు ఉన్నాడు.

"పురంధరా! నీకు ఉన్న భక్తి విశ్వాసాలకు నీకు తప్పక ఉన్నతి లభిస్తుంది. ఇంకో కోరిక వెళ్ళేటప్పుడు చెబుతానన్నావే! అదేమిటి?" అన్నారు. వాడు వెక్కి వెక్కి ఏడుస్తూ, వచ్చే వెక్కిళ్ళను ఆపుకుంటూ అన్నాడు. "స్వామీ! మా నాన్న దేముడిని లౌకికమైన చిన్న చిన్న విషయాలు గురించి అడగకూడదు. జన్మ అంటేనే దు:ఖం. మరుజన్మ లేని మోక్షాన్ని కోరుకోవాలి. దానికోసం మనం సత్యమే చెప్పాలి. ధర్మంగా జీవించాలి. మహాత్ములను మనం కోరవలసినది మోక్షమే అని చెప్పేవాడు. స్వామీ! నువ్వే మానాన్న చెప్పిన మహాత్ముడివి. నాకు మోక్షం ప్రసాదించు స్వామీ!" అంటూ బావురుమన్నాడు. కదిలిపోయారు స్వామివారు. పన్నెండేళ్ళ పసివాడు మాట్లాడే మాటలా ఇవి. ఆశ్చర్యపోయారు. అబ్బురపాటు చెందారు. ఎంతో ప్రేమతో కరుణగా చూచి నవ్వుతూ "తగిన సమయంలో భగవంతుడు నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు" అంటూ దూరంగా ఉన్న జమిందారుని పిలిచి "పురంధరుని విషయంలో ఏమి జరిగినా మఠానికి టెలిగ్రాం పంపు" అన్నారు.

చాలాకాలం గడిచిపోయింది. స్వామివారు కాశీ యాత్ర ముగించి తిరిగివచ్చారు. అప్పుడు కంచిలో ఉన్నారు. ఒక మధ్యాహ్నం హఠాత్తుగా మఠం నుండి బయల్దేరి కామాక్షీ గుడిలోని కొలనుకి వచ్చారు. స్నానం చేసి ఒక గంట సేపు జపం చేశారు. మళ్ళీ స్నానం చేసి మళ్ళీ జపం చేస్తున్నారు. సాయంకాలం ఆరుగంటలదాక ఈ విధంగా ఎనిమిది సార్లు చేసారు. స్వామివారు ఎందుకిలా చేస్తున్నారో ఎవరికీ అవగతం కాలేదు. చివరిసారిగా స్నానం చేసి మెట్లు ఎక్కుతున్నప్పుడు మఠం నుండి టెలిగ్రాం పట్టుకుని "కర్నూలు నుండి టెలిగ్రాం వచ్చింది స్వామి! పురంధరకేశవుల ఆరోగ్య పరిస్థితి ఎంతో ఆందోళనకరంగా ఉన్నదట. మరి ఈ పురంధరకేశవులేవరో ఎవరికీ తెలియడం లేదు స్వామి" అన్నారు.

"పురంధరకేశవులు కొద్దిసేపటి ముందే కాలం చేశాడు. వాని గ్రామం వెళ్ళినపుడు నన్ను మోక్షంకై ప్రార్థించాడు. మంచి జీవి అతడు. చంద్రమౌళీశ్వరుని అనుగ్రహము వలన మోక్షం లభిస్తుందని చెప్పాను. కొద్ది కాలంగా అతనికి విషజ్వరం వచ్చింది. శరీరబాధ గురించి పట్టించుకోకుండా మోక్షేచ్ఛతో పరితపించిపోతున్నాడు. అతనికింకో ఆరు

జన్మలు పొందాల్సిన కర్మ ఉన్నది. ఎలాగోలా మోక్షం కలగాలని ప్రార్థిస్తూ ఇలా జపం చేస్తున్నా. "పురంధరకేశవులు శుద్ధాత్మ" అంటూ మఠం వైపుకు దారి తీసారు. స్వామివారు అతనికి మోక్షం లభించిందనే విషయం స్పష్టంగా చెప్పలేదు. అయితే ఆ పురంధరునికి మోక్షం వచ్చి వుంటుంది అనడంలో మరి సందేహం ఏముంటుంది.

అయితే అద్వైత శాస్త్రం 'జ్ఞానాదేవహి కైవల్యం' అని చెబుతున్నది కదా! ఇంకొకరికి మోక్షం ప్రసాదించడం ఎలా అన్న ప్రశ్న పుస్తక జ్ఞానం కలవారికి తోచవచ్చు. మహాస్వామి వారి తపస్సు చేత అతని కర్మలను దహించడం వల్ల శుద్ధమైన జీవునికి జ్ఞానం కలిగి ఉండవచ్చు. అయినా దీనిగురించి విచారం అనవసరమేమో! శ్రీ రమణ భగవానులు తమ తల్లిగారితో సహా అనేక మందికి మోక్షాన్ని అనుగ్రహించారు.

( శ్రీకార్యం చల్లా విశ్వనాథ శాస్త్రి, ఋషిపీఠం ప్రచురణల నుండి)

### పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**మార్చి 2025**

14 శుక్ర: ఫాల్గుణ పూర్ణిమ, హోలీ పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

24 సోమ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

30 ఆది: శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది - శ్రీ సద్గురు పాదపూజ

**ఏప్రియల్ 2025**

6 ఆది - శ్రీరామ నవమి - శ్రీసద్గురు పాదపూజ

12 శని - చైత్రపూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

23 బుధ - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

రెండవ అధ్యాయము - నారదుల వారు మొదటి అధ్యాయంలో పరాభక్తి యొక్క స్వరూపమును నిర్వచించారు. ఈ రెండవ అధ్యాయంలో 25వ సూత్రము మొదలుకొని 33వ సూత్రం వరకు ఆ పరా భక్తి యొక్క మహత్తునూ, ఉత్కృష్టతను వివరిస్తున్నారు. సాధనకు పనికి వచ్చే ఎన్నో అంశములు ఈ రెండవ అధ్యాయంలో మనకు లభిస్తాయి.



భక్తి సూత్రము 25: **సాతు కర్మ జ్ఞాన యోగేభ్యోపి అధికతరా**

తాత్పర్యము: కర్మ జ్ఞాన యోగముల కంటే పరాభక్తి ఎంతో గొప్పది రెండవ సూత్రములో నిర్వచించబడిన "**సాతు అస్మిన్ పరమ ప్రేమ స్వరూపా**"తో ఈ సూత్రమును అన్వయించుకుని ఆ ప్రేమ స్వరూపమైన పరాభక్తి గురించే ప్రస్తావిస్తున్నారని గ్రహించాలి.

ఈ సూత్రములో కర్మ, జ్ఞాన, యోగములు మూడింటికంటే పరాభక్తి గొప్పదని నారదులు తెలియజేస్తున్నారు. అయితే ఇక్కడ యోగము అంటే రాజయోగమని కొందరు నిర్వచించారు. అంతేకాక ఏ సాధనా మార్గమైనప్పటికీ యోగము కింద జమ కట్టవచ్చు. అంటే కర్మ, జ్ఞాన యోగములు సాధనములనీ పరాభక్తి మాత్రమే సాధ్యమని దీని భావము. అంతమాత్రం చేత పరాభక్తి ఈ సాధనా మార్గముల కంటే భిన్నమూ, విలక్షణమైనదని భావించరాదు. పరాభక్తి యందు మనసు ఆరూఢమైన సాధకుడు మనసుకు స్వాభావికంగా ఉన్న జ్ఞాన, ఇచ్ఛా, క్రియా శక్తులు మూడింటిని భగవంతుని కొరకే వినియోగిస్తాడు. జ్ఞానశక్తితో భగవంతుని గ్రహించి ఇచ్ఛాశక్తి ద్వారా సర్వాత్మ సమర్పణ చేసి, క్రియాశక్తి ద్వారా ఇంద్రియములను ఆధీనములో ఉంచుకుని భగవంతుని సేవకై వినియోగించి తరిస్తాడు.

భగవద్గీతలో గీతాచార్యులు '**తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున!**" అని వివరించినట్లు తపస్సు, జ్ఞాన, కర్మ మార్గముల కంటే పరాభక్తి వున్నతమైనదని గ్రహించాలి. భక్తి తత్వమునకు పరమావస్థ అయిన పరాభక్తిలో సంకల్పములు ఉండవని నారదుల వారు ఈ సూత్రము ద్వారా తెలియచేస్తున్నారు.

భక్తి సూత్రము 26: **ఫల రూపత్వాత్**

తాత్పర్యము: పరాభక్తి ఫలరూపమైనది. యోగములన్నీ సాధనా మార్గములైతే పరాభక్తి ఆ సాధనముల వలన కలిగే ఫలము వంటిదని ఈ సూత్రము ద్వారా వివరిస్తున్నారు. భగవంతుని మీద అనన్య ప్రేమ కల సాధకుడికి భక్తిని ప్రకటించడం తప్ప సాధించవలసినది మరేదీ కనిపించదు. అందుకే భక్తి సాధనమూ మరియు సాధ్యము అని పిలువబడుతుంది. నిజమైన భక్తి సహజ సిద్ధమైన పరిపూర్ణత్వమును కలిగి వుంటుందని గ్రహించాలి. సాధనల ద్వారా ఒక గమ్యమును చేరుకోవాలన్న ఆరాటంగాని, లేక సాధించిన తర్వాత దాని నుంచి విరమించుకునే అవసరముగాని భక్తికి ఉండవు. భగవంతుడు చూపించే అవ్యాజమైన ప్రేమలో ఒక అంశయే పరా భక్తి అవుతుంది.

భక్తి సూత్రము 27: **ఈశ్వరస్య అపి అభిమాన ద్వేషిత్వాత్ దైన్య ప్రియత్వాత్ చ**

తాత్పర్యము: భగవంతునికి అహంకారమనిన అనిష్టము మరియు దైన్యము యెడల ప్రీతి వుండును. ఈ సూత్రము ద్వారా నారదులు పరా భక్తికి దోహదం చేసే వాటిని అదేవిధంగా అడ్డుకొనేవాటిని గురించి తెలియచేస్తున్నారు. సాధనలో స్వప్రయత్నం వుంటుంది. తద్వారా నేను చేస్తున్నాననే భావన, అలాగే అహంకారం కూడా తోడు అయ్యే అవకాశం ఉంది. పరాభక్తికి ఈ అహంకారము అడ్డు అవుతుందనీ అది నాశనమైనప్పుడు మాత్రమే నిజమైన భక్తి కలుగుతుందని నారదులు తెలియజేస్తున్నారు.

అయితే ఈ సూత్రములోని పదములను బట్టి భగవంతుడికి కూడా రాగ ద్వేషములు ఉంటాయని భావించకూడదు. ఎందుకంటే గీతాచార్యులు భగవద్గీతలో **"సమోహం సర్వభూతేషు నమే ద్వేషోస్తి న ప్రియః"** అంటూ తాను సర్వభూతములను సమదృష్టితోనే చూస్తానని తెలిపారు. దీనినే వివరిస్తూ ప్రహ్లాదుడు **"న ఏష పరావర మతిర్భవతః"** అంటూ విష్ణు మూర్తి యొక్క సమత్వమును స్తుతిస్తాడు. అయితే అందరి పట్ల సమముగా వున్నప్పటికీ ఆ భగవంతుని అనుగ్రహమును పొందడానికి అహంకారము అడ్డుపడుతుంది అని గ్రహించాలి.

ఆ అహంకార త్యాగమే దైన్యమని గుర్తించాలి. దైన్యములో నీవు తప్ప ఇతరములు ఏవీ అవసరం లేదన్న శరణాగతి, సమర్పణ భావన కలసినప్పుడు సాధకుడు భగవంతునితో అనన్యత్వమును పొందగలుగుతాడు. అటువంటి భావన పరాభక్తికి తీసుకుని వెళుతుంది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. శ్రీకృష్ణుని స్నేహితుడైన సుధాముని విషయములో ఇది మనకు కనిపిస్తుంది. - సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**మార్చి 2025**

2 ఆది: ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన, సత్సంగం.

14 శుక్ర: ఫాల్గుణ పూర్ణిమ, హోలీ పండుగ - శ్రీ సద్గురు పాదపూజ.

24 సోమ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

28 శుక్ర: మాసశివరాత్రి

29 శని: అమావాస్య

30 ఆది: శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది - ఉ. 10.00 గం.లకు పంచాంగ శ్రవణం, అనంతరం శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

మార్చి 30 నుండి ఏప్రియల్ 5 వరకు (ఆదివారం నుండి శనివారం వరకు) మౌన ధ్యాన సాధన సప్తాహ శిబిరం.

**ఏప్రియల్ 2025**

6 ఆది - శ్రీరామ నవమి - తె.జా 5-30ని. శ్రీసద్గురుపాదపూజ, ఉ.11గం. సామూహిక కళ్యాణ మహోత్సవము, భక్త సమారాధన.

12 శని - చైత్ర పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

23 బుధ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

26 శని - మాస శివరాత్రి

27 ఆది - అమావాస్య

30 బుధ - అక్షయ తృతీయ - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

మార్చి 2025

14 శుక్ర: ఫాల్గుణ పూర్ణిమ, హెూలీ పండుగ - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

24 సోమ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

30 ఆది: శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

ఏప్రియల్ 2025

6 ఆది - శ్రీరామ నవమి - ఉ.11 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 శని - చైత్రపూర్ణిమ - ఉ. 11 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

23 బుధ - శ్రీగురుదశమి - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, విశాఖపట్నవాసులు అయిన దాసరి శ్యామ్ ప్రసాద్ గారు 13-2-25 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 38 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

93. **ఎనసి యనిత్యము లగుసీ, తనుకరణంబులను గూడి తాపత్రయతో**
**యనిథిం గూలితి వికనైనను రాము పదాంబుజములు నమ్మవె మనసా.**

తాత్పర్యము: అనిత్యములైన శరీర ఇంద్రియములతో కూడి, తాపత్రయములతో అంధకారమున బడితివి. ఇకనైన శ్రీరామ పదాంబుజములను స్థిరముగా నమ్ముము మనసా.

94. **సమమమకారాహంకారముల విడిచి రామచంద్రు రక్షకుగా ని**
**త్యము దలచెద నికనీప్రేష్యము నాకే మనుసరింప నవయగ మనసా.**

తాత్పర్యము: అహంకార మమకారములను విడచి శ్రీరామచంద్రునే రక్షకునిగా ఇక తలచెదను. తద్వారా రాముని ప్రేమను పొంది ఆనందింపగ మనసా.

95. **నీవలన గదా నాకీ జీవత్వము గలిగె నందుచే సంసారం**
**బావిర్భవించె నిక సీతావిభు గొలుతు స్థవద్వ్ధార్థము మనసా.**

తాత్పర్యము: ఓ మనసా! నీ వలన గదా నాకు ఈ జీవత్వము కలుగుట, అందుకే సంసారమున బడుట. ఇక అట్టి నిన్ను సంహరించడానికై సీతా విభుని గొలిచి నేను సమున్నతిని పొందుదును మనసా.

96. **ఏమఱక నిన్నేలిన, రాముని దలప నతడేమి రక్షింపడ ......**
**......ని, న్నేమని యిక నమ్మవచ్చు నిలలో మనసా.**

తాత్పర్యము: రక్షించువాడగు రాముని తలపక అజ్ఞానముతో అతడేమి రక్షించునని భ్రమలో పడితివి, నిన్ను ఇంక ఇలలో ఎలా నమ్మవచ్చు మనసా?

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

పృథ్వియు నీవు, గగనము నీవు, వాయు, జలాగ్నులూ నీవే!! పద్మమందమరు విధాతవు నీవు, ముక్కంటివి నీవు, వటపత్రశాయివీ నీవే!! పాపముల పొగొట్టు ఆపద్బాంధవుడివి నీవు, ముక్కాలముల సృష్టికర్తవూ నీవే!! పావనుడ జేయ విచ్చేసితివి నీవు, నన్ననుగ్రహించిన రక్షకుడవూ నీవే!!

(భూమియు నీవు, ఆకాశము నీవు, మిగిలిన పంచభూతములైన నీరు, అగ్ని, వాయువు అన్నియునూ నీవే! తామరపుష్పము నుండి ఉద్భవించిన చతుర్ముఖుడవు నీవు, పాలసముద్రమందు శయనించువాడివి నీవే! పాపములను పోగొట్టు సద్గుణములనిచ్చు ఆపద్బాంధవుడవు నీవు, భూతకాలమందు లోకములన్నింటినీ సృష్టించినవాడవు నీవే! ఇప్పుడు శునకమువలె జీవించుచున్న నేను రక్షింపబడుటకు ఇచ్చోటకు విచ్చేసి నన్ను అనుగ్రహించినవాడవు నీవే!) అన్నాడు సుగ్రీవుడు.

ఇంకనూ "రామా! నన్ను దయచేసి మన్నించవలయును. వాలియొక్క పరాక్రమమును బాగుగా తెలిసిన నేను ఆ విషయమును మీకు తెలియపరచ యత్నించితిని" అని పలికి రామునికి వందన మొసగె వినమ్రతతో సుగ్రీవుడు.

ఆ సమయమున ఆ చెట్టు వ్రేళ్ళక్రింద నిద్రించుచున్న వాసుకి అను సర్పరాజు లేచి, రాముని నయనములకు మాత్రమే తెలిసినట్లుగ "ఓ దేవా! కృత యుగమందు అమృతము కొరకు పాలసముద్రమును మథించు సమయమున కవ్వమునకు కట్టబడు త్రాటిగ నన్ను మలచి మథించు సమయమున నా శరీరమందు ఏర్పడిన గాయములను పోగొట్ట మీ దివ్య హస్తములతో నిమిరారు. అప్పుడు నేను నా అలసట తీరు వరకు నిద్రించుటకు ఒక స్థలము కావలయునని మిమ్ము అర్థించ, మీరు 'ఎవ్వరూ సులభముగ చేరుకోలేనటువంటి ఋష్యమూక పర్వతమందు నిద్రించు. పిదప వచ్చు త్రేతాయుగమందు నేను ఒక

మానవునిగ రాముడను నామధేయముతో అచ్చటకు వచ్చెదను. ఆ రాముడు వచ్చువరకు నీవు అక్కడే నిరీక్షించుము. నిద్రావస్థలోనుండు నీ శరీరముపై ఏడు పనసచెట్లు పెరిగి నీవుండు స్థలమును నేను తెలుసుకొన చిహ్నముగ నిలిచియుండును. (అందుచేతనే వాలి ఒక వృక్షమును ఆడించినప్పుడు వాసుకియొక్క శరీరముపై మొలిచిన అన్య వృక్షములూ కదలాడినవి.) నీపై ఉన్న వృక్షములను నేను క్రిందపడవేయు సమయమున నీవు నిద్రావస్థనుండి లేచి మరల నీ స్వస్థలమునకు వెళ్ళెదవు" అన్నారు. "గాఢనిద్రావస్థలో ఉన్న నేను మీ రాక కొరకు నిరీక్షిస్తూ ఇన్నేళ్ళు వేచియున్నాను. మీరు నాపై చూపిన కరుణకు కృతజ్ఞతలు. నాకు సెలవిప్పించండి" అని కోరి, రామునికి వందనములొసగి సర్పరాజైన వాసుకి తన స్వస్థలమునకు వెళ్ళిపోయాడు.

వాసుకి వెళ్ళిపోయిన పిదప రామ, సుగ్రీవులిరువురూ తదుపరి తామాచరించబోవు కార్యమును గూర్చి చర్చించుకున్నారు. అప్పుడు సుగ్రీవుడు రామునితో, "కొన్ని నెలల క్రితం అసురుడొకడు ఒక యువతిని అపహరించి, ఈ మార్గముగుండా ఆకాశమున ఒక విమానముపై పయనించి వెళ్ళుటను మేము గమనించాము. ఆతడు రావణుడే అయ్యుండాలి. ఎందుకంటే, ఆతని వద్దనే కుబేరుని పుష్పక విమానం ఉన్నదని నాకు తెలుసు. అ విమానం నుండి మేము అమరియున్న చోటున గుడ్డతో కట్టబడిన ఒక మూట పడింది. దానిని తెరచి చూస్తే స్త్రీలు అలంకరించుకొను కొన్ని నగలు కనబడ్డాయి" అని తెలియజేసి ఆ మూటను తీసుకుని రమ్మని హనుమంతునికి చెప్పాడు.

వాయుపుత్రుడు తీసుకుని వచ్చిన ఆ ఆభరణములను జూచి రాముడు 'ఇవి సీతయొక్క ఆభరణములే'నన్నాడు. కన్నీటితో నిండిన లక్ష్మణుడు సీత కాళ్ళకు ధరించు ఆభరణములను చూసి, "అన్నా! ప్రతిదినము వదినగారి పాదములకు నమస్కరించు అలవాటు నాకుండుటచేత ఈ నగలు మాత్రం వదినగారి కాలి ఆభరణములేనని ఖచ్చితంగా చెప్పగలను" అన్నాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

ఇక్కడ అమ్మవారు పరమేశ్వరుడిని సూటిగా మూడు ప్రశ్నలు అడిగింది.

1. అందరకన్నా శ్రేష్టమైన తమరు నమస్కారం చేసేది ఎవరికి?
2. గురుమాహాత్మ్యం ఎటువంటిది?
3. దేహి ఎలా బ్రహ్మమయుడౌతాడు?

అడుగుతున్నది సామాన్య వ్యక్తికాదనీ, అమ్మ వారనీ మనం మరచిపోకూడదు. సర్వజ్ఞుడి 'సామేను జే కొన్నచానకు' తెలియని విషయాలుంటాయా? తెలిస్తే అడగటం ఎందుకు?

త్రిమూర్తులలో ఒకడైన శివుడు నమస్కరిస్తున్నది ఎవరికో తెలియనిది కాదు తల్లి, త్రిమూర్తుల కన్నా శ్రేష్ఠుడు సద్గురుమూర్తియని ఆమెకు తెలుసు. అందువల్లనే ఆమె రెండవ ప్రశ్నగా గురుమాహాత్మ్యాన్ని వివరించమని కోరింది. గురుమాహాత్మ్యాన్ని తెలుసుకుంటే వచ్చే లాభమేమిటి? ఆ గురువును ఆశ్రయించిన దేహి బ్రహ్మమయుడౌతాడు. "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనాః" అన్న శాస్త్ర వాక్యాన్ని బట్టి, సామాన్య మానవులకు సూచన యిప్పించటానికి మొదటి ప్రశ్న అడిగింది అమ్మవారు. పరమశివుడికి కూడ నమస్కరించదగిన ప్రభువు గురుదేవుడు గనుక, ఆయన మహత్వం తెలుసుకోవటమూ, తదుపాసన చేసి బ్రహ్మత్వాన్ని పొందటమూ అన్న ప్రయోజనాలు జీవుడికి సిద్ధించ వలెననే కృపతో యీ ప్రశ్నలు వేసింది జగజ్జనని. అజ్ఞానాంధకారంలో చిక్కుకున్న మందబుద్ధియై ఎవరిని ప్రశ్నించాలో, ఏమని ప్రశ్నించాలో కూడ తెలియని దైన్యస్థితి జీవుడిది. పైగా అంత నిగూఢమైన విషయములను బోధించటానికి తగినవాడు పరమేశ్వరుడే. అందుచేతనే అమ్మవారు యీ ప్రశ్నలు వేసింది లేకపోతే దేహి కాని (దేహ స్పృహలేని) ఆమెకు దేహిని గురించీ, దేహి ఎలా బ్రహ్మత్వం పొందుతాడనే విషయాన్ని గురించి అడగవలసిన అవసరమే లేదు. మహాత్ముల కృషి ఎల్లప్పుడూ జీవోద్ధరణకే గదా!

**ఇతి సంప్రార్థిత శ్శ శ్వ న్మ హా దేవో మహేశ్వరః**
**ఆనందభరిత స్స్వాంతే పార్వతీ మిదమబ్రవీత్.** 16

**<u>పదవిభాగము</u>** :- ఇతి-సంప్రార్థితః- శశ్వత్-మహాదేవః-మహేశ్వరః -

ఆనంద భరితః- స్వాంతే-పార్వతీం-ఇదం-అబ్రవీత్

**టీక** :- ఇతి=ఈ విధముగ; శశ్వత్= మరల మరల అనేక పర్యాయములు; సంప్రార్థితః= చక్కగా ప్రార్థించబడిన వాడైన; మహాదేవః= మహాదేవుడైన; మహేశ్వరః=మహేశ్వరుడు; స్వాంతే=మనస్సులో; ఆనందభరితః=ఆనందముతో నిండినవాడై; పార్వతీం= పార్వతికి; ఇదం= యిలా; అబ్రవీత్= చెప్పెను.

**వ్యాఖ్య** :- తను వేసిన ప్రశ్నలను ఊరికే ఒక పర్యాయము అడిగి ఊరుకోలేదు అమ్మవారు. ఆమె మళ్ళీ మళ్ళీ ఆయనను చక్కగా ప్రార్థించింది. జగత్కళ్యాణానికై అమ్మవారి కృషి యీ వాక్యంతో బయటపడుతోంది. రహస్యాతి రహస్యమైన విషయాలను ఎవరూ ఎవరికి బడితేవారికి అడిగిన మాత్రాననే చెప్పరు. అమ్మవారి తత్పరత, శ్రద్ధ మహాదేవుణ్ణి సంతృప్తి నొందించగా ఆయన మనస్సు ఆనందంతో నిండిపోయినదట. ఆ సంతోషపూర్ణమైన హృదయం ప్రసన్నంకాగా, పార్వతితో పరమేశ్వరుడు యిలా అన్నాడు.

**న వక్త వ్యమిదందేవి! రహస్యాతి రహస్యకమ్**
**న కస్యాపి పురా ప్రోక్తం త్వద్భక్త్యర్థం వదామితత్. 17**

**పదవిభాగము** :-

న- వక్తవ్యం-ఇదం-దేవి-రహస్య-అతి-రహస్యకమ్
న-కస్య- అపి-పురా-ప్రోక్తం-త్వత్-భక్త్యర్ధం-వదామి-తత్

**టీక:-** దేవి!=ఓదేవి; ఇదం=ఇది (ఈ తత్త్వము); రహస్యాతి రహస్యకమ్= రహస్యములలో అతి రహస్యమైనది; (అందుచేత) నవక్తవ్యం= (అధికారులు కాని వారికి) చెప్పదగినదికాదు; పురా= ఇంతకు ముందు; కస్యాపి= ఎవ్వనికి కూడ; నప్రోక్తం=చెప్పబడినది కాదు; తత్= ఆ రహస్య తత్త్వమును; త్వ ద్భక్త్యర్థం= నీ భక్తి కారణంగా; వదామి= చెప్పుచున్నాను.

**వ్యాఖ్య** :- "ఓ దేవీ నీవడిగిన ప్రశ్నలకు సమాధానమైన తత్త్వము రహస్యములలో రహస్యమైనది. అందుచేత అధికారులుకాని వారికి చెప్పరాదు. ఇంతకు ముందు ఎవ్వనికీ చెప్పబడినది కాదు. కాని అంత పరమరహస్యమైన తత్త్వమును నీకు నాయందున్న భక్తిని పురస్కరించుకొని చెబుతున్నాను" అన్నాడు గురుదేవుడైన పరమేశ్వరుడు.

- సశేషం

# సమర్థ సద్గురు

[యాజమాన్యం తదితర వివరాలు]

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | | |
|---|---|---|
| ప్రచురణ స్థలం | - | శ్రీ కాళీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - | మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - | సి.వి. రమణబాబు |
| జాతి | - | భారతీయుడు |
| విలాసము | - | D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - | పాలూరి శివరామ కాళీప్రసాద్ |
| జాతి | - | భారతీయుడు |
| విలాసము | - | D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - | యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్<br>D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియజేస్తున్నాను.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణ బాబు

ది. 1-3-2025

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

20. వడాలి వాస్తవ్యులైన వారణాసి బ్రహ్మయ్య శాస్త్రిగారు వయోలిన్ వాద్యంలోను, వారి సోదరులు ఘంటయ్య శాస్త్రిగారు మృదంగ వాద్యంలోను, ఆ రోజులలో దక్షిణాదిలోనే మహా ప్రసిద్ధులైన విద్వాంసులు; శ్రీ బాబు భక్తులు. గుండుగొలనులో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో కూడ (1960 ప్రాంతంలో) రెండు సంవత్సరాలు వారు శ్రీ బాబు సన్నిధిలో సంగీత కచేరీ చేసి శ్రీ బాబు ప్రేమకు పాత్రులు కాగలిగారు.



వారి వృద్ధాప్యంలో శ్రీ బాబు ఒకసారి వడాలి వెళ్ళారు. సీతారామయ్య గారింట్లో కూర్చుని, "ఈ రోజు మన వారణాసి సోదరుల చేత కచేరి చేయించాలి" అన్నారు. బుల్లిమామయ్య "వారిద్దరూ కదలలేని పరిస్థితిలో మంచం మీద ఉన్నారు బాబూ!" అన్నారు. శ్రీ బాబు "అలాగా! నేను చెప్పానని చెప్పి వారిద్దరినీ అలా మంచాలతోనే ఇక్కడికి తీసుకుని రండి" అన్నారు. అలాగే తీసుకుని వచ్చారు.

శ్రీ బాబు వాళ్ళిద్దరిని పలకరించి, "మీ కచేరీ వినాలని వచ్చాను" అన్నారు. వాళ్ళు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ "ఈ జన్మకు యిక మాకా భాగ్యం లేదు బాబూ! కాళ్ళు చేతులు కూడా కదలటం లేదు" అన్నారు. శ్రీ బాబు రెండు గ్లాసులతో పాలు తెప్పించి, రెండు గ్లాసులనూ తాము పట్టుకొని ఒక్క నిమిషం ధ్యానం చేసుకుని, తాము వాటిని నివేదన చేసుకుని, వారిద్దరికీ యిచ్చి, "ఇదిగో జగన్మాత ప్రసాదము. తీసుకోండి" అన్నారు. వారు తాగిన తరువాత, వయోలిన్, మృదంగము తెప్పించి వారి చేతికిచ్చి "ప్రయత్నించండి" అన్నారు. మంచాల మీదనే గోడకానించి కూర్చో బెట్టారు. ఇద్దరు కష్టం మీద తమ వాయిద్యాలను శృతి చేసుకున్నారు. 'ఒక్కసారి తమ పాదం తాకితే మాకు శక్తి వస్తుంది బాబూ!' అని

వాళ్ళిద్దరూ లేవబోయారు. వద్దని వారించి శ్రీ బాబు తామే వారిద్దరి వద్దకు వెళ్ళి తమ పాదమును అందించారు.

ఆ దివ్య చరణ కమలములను కనులకు అద్దుకొని, 90వ పడిలో పడిన ఆ వృద్ధ సోదరులు మూడు గంటల సేపు గంధర్వులు కూడా మెచ్చే కచేరీ చేశారు. “ఎవరని నిర్ణయించేది రా! శివుడవో, భవుడవో, మాధవుడవో” అని, “ఎంతని వర్ణింతును శబరీ భాగ్యమును” అని, వాయిస్తూ కన్నీరు పెట్టుకున్నారు. శ్రీ బాబు కూడా ఆనందాశ్రువులతోనే వారిద్దరిని ఆశీర్వదించి “జగన్మాత గాన సరస్వతీ రూపంలో వారిని తన బిడ్డలను చేసుకొన్నది” అన్నారు.

21. గుండుగొలనులో శ్రీ బాబు మేడబాబుగారింట్లో ఒకరోజున శ్రీహరిగారు, బందాతాతయ్యగారు, సీతారామయ్యగారితో మాట్లాడుతున్నారు.

బందాతాతయ్యగారు శ్రీ బాబుతో “బాబూ! మానవుడు తరించవలెనంటే, మహాత్ములను ఆశ్రయించి, వారి వద్ద నుండి మంత్రోపదేశమును పొంది, సాధన ద్వారా లక్ష్యార్థమును చేరుకోగలరని శాస్త్రములు చెబుతున్నవి. మా పురాకృత పుణ్య విశేషం వల్ల తమ సన్నిధికి చేరుకొని, యిన్ని సంవత్సరాల నుంచి సేవించుకో గలుగుతున్నాము. కాని తమ వద్ద ఏ మంత్రోపదేశమును పొందలేక పోయామని చింతగా ఉన్నది” అన్నారు.

- సశేషం

*మానవునిలోనే భగవంతుడు వున్నాడు. ఆ విషయం తెలుసుకో లేకపోతున్నాడు మానవుడు. అతని చుట్టూ అజ్ఞానపు పొరలు ఆవృతమై వుండటమే ఇందుకు కారణం. ఈ అజ్ఞాన పొరలు విడనప్పుడు గుడికి వెళ్ళినా, చర్చికి వెళ్ళినా, మసీదుకు వెళ్ళినా ఫలితం శూన్యం. దైవదర్శనం దుర్లభం! అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలినప్పుడే మనో మందిరానున్న మూర్తిని దర్శించవచ్చు. ఆ చీకట్లని చీల్చడానికి కరదీపికను అందించే కరుణా సింధువే సద్గురువు!*

- శ్రీ కాళీబాబు



విష్ణు కథలు

-రమణ ప్రసాద్

# భక్త రామదాసు

సర్వ పర్వతాలకు అధిపతి అయిన మేరువు, భార్య మేనకాదేవితో బ్రహ్మదేవుని కొరకు తపస్సు చేశాడు. ఆ పరమేష్ఠి ప్రసన్నుడై 'నీకు ఇష్టమైన వరము కోరుకొమ్మ'నగా "దేవా! నాకు రామధ్యాన పరాయణుడగు పుత్రుడిని ప్రసాదించమని" కోరుకున్నాడు. కొంతకాలానికి వారికి భద్రుడను పుత్రుడు కలిగాడు. అతడు శ్రీ రాముని ధ్యానించగా శ్రీమన్నారయణుడు రామ రూపమును ధరించి శ్రీదేవి, ఆదిశేషువులు సీతాలక్ష్మణులై వెంటరాగా భద్రునికి సాక్షాత్కరించి వరం కోరుకొమ్మన్నాడు. భద్రుడు పరమానందంతో "స్వామీ! శంఖ, చక్ర, గదాయుధాలను ధరించి సమస్త లోకమునకు శుభాన్ని చేకూరుస్తూ, దయామూర్తివై, నా బోటి వారికి మోక్షాన్ని ప్రసాదిస్తూ నా శిరస్సున నిలచి ఉండే వరాన్ని ఇవ్వమ"ని కోరుకున్నాడు. ఆ రోజు నుండి ఆ ప్రదేశం "భద్రాద్రి" అనే పేరుతో పిలువబడుతోంది.



భద్రుని కారణంగా ఇలలో వెలసిన శ్రీరామచంద్రుడు తమ్మల దమ్మక్క అనే భక్తురాలికి తన ఉనికిని తెలియచేశాడు. ఆమె నిత్య పూజా నైవేద్యాదికాలను ఏర్పరిచింది.

తనకు మేలైన గోపురాలను భక్తి శ్రద్ధలతో సకల సదుపాయలను అందించేవారు ఎవరా? అని నలుదిక్కులా చూపు సారించాడు. శ్రీ రామచంద్రుని అధరాలపై చిరు దరహాసం విరిసింది. అతడే జగమెరిగిన రామదాసుడైన కంచెర్ల గోపన్న. అతని తండ్రి లింగన్న మంత్రి, తల్లి కామమ్మ. వారు సంతానం కోసం మనసారా హరిని ప్రార్థించారు. తత్ఫలితంగా గోపన్న పుట్టాడు. వచ్చీరాని మాటల

వయస్సులో గోపన్న పిలచిన పలుకు "శ్రీ రామా" అని. గోపన్నకు ఐదు సంవత్సరాలు వచ్చాయి. తండ్రి అక్షరాభ్యాసమూ, ఉపనయనమూ చేయించాడు. గురువైన రఘునాథ భట్టరాచార్యులు అతనికి రామాయణం తాత్పర్య సహితంగా బోధించాడు. రామాయణ గాథలను వింటూ "ఆ రాములవారి కాలంలో తాను పుట్టివుంటే ఎంత బాగుండేది? విశ్వామిత్ర యాగ రక్షణలో రాములవారికి తోడ్పడేవాడిని, సీతారాముల కళ్యాణ సమయంలో తలంబ్రాలు అందించేవాడిని, కానలకు పోకుండా అడ్డుపడేవాడిని. సుగ్రీవునితో కలిసి సీతమ్మను వెదికేవాడిని. ఆంజనేయుని కంటే భక్తితో రాముని పాదారవిందములను వదలక సదా సేవ చేసేవాడిని. ఇతడే నారాయణుడు అని ఎలుగెత్తి చాటేవాడిని" అంటూ ఎల్లప్పుడూ శ్రీరామ ధ్యాన తత్పరుడై ఉండేవాడు.

గోపన్న విద్యావంతుడయ్యాడు. కొంతకాలానికి అతని తల్లిదండ్రులు కన్నుమూశారు. గృహ బాధ్యతలు అతనిపై పడ్డాయి. బంధువుల కోరికపై గృహస్థ జీవితం ఆధ్యాత్మిక సాధనకు రాజమార్గమని గ్రహించి, కమల అనే సుగుణవతిని వివాహం చేసుకున్నాడు. తనకు ఒక కుమారుడు కలిగాడు. అతనికి రఘురాముడని పేరుపెట్టుకున్నాడు.

"అతిథి దేవోభవ" అంటూ ఇంటికి వచ్చే అతిథులలో శ్రీహరిని దర్శిస్తూ వారికి కొసరి కొసరి వడ్డిస్తూ మహదానందాన్ని పొందేవాడు.

ఒకనాడు 'సారే జగ్‌కే పాలన హారీ, మాతాపితా తుమ్‌హెూ' అని పాడుతూ కాషాయాంబరధారి, దివ్య తేజోమూర్తి అతని ముందు వచ్చి నిలచాడు. గోపన్న ముగ్ధుడై చేతులు జోడించాడు. గోపన్నను చూచి ఆనంద భరితుడై "నీకు శ్రీరామచంద్రుని అనుగ్రహం కలుగుతుంది. జనన మరణాలనేవి మానవ ధర్మాలు. జననమరణ రహితమైన బ్రహ్మపద ప్రాప్తి పొందటమే మానవ జన్మకు సార్థకత. హరిని భజిస్తే ఆనందం కలుగుతుంది. ఈ సంసారం సార హీనమని గుర్తించి ఈ సంసార సాగరాన్ని తరించే నావ అయిన తారక మంత్రాన్ని నీకు ఉపదేశిస్తున్నాను గ్రహించు" అన్నాడు. ఆ సిద్ధ గురుమూర్తియే సమర్థ సద్గురువైన "కబీరు". రామనామం చాటుతూ ముందుకు సాగిపోయాడు కబీర్.

- సశేషం



అడ్డం -
1. శ్రీరామజయరామజయజయరామ
4. సారూప్యం
6. కఠోపనిషత్తు
7. భవతి
8. మరా
10. నిశుంభుడు
11. పురుష
12. చందన
13. తులసీదాసు

నిలువు -
2. మననాత్
3. మనసా
5. శేషగిరిరావుగారు
6. కరోతి
7. భరద్వాజుడు
9. భవాని
11. పునర్వసు

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

2024 డిసెంబరు 28 నుండి 30 వరకు గుడివాడ పట్టణంలో జరిగిన సత్సంగ కార్యక్రమ దృశ్యములు







భీమవరంలో జరిగిన సత్సంగ కార్యక్రమ దృశ్యము




జనవరి 21 న దేవరపల్లి గ్రామము నందు జరిగిన
అఖిలాంధ్ర సాధుపరిషత్ లో పాల్గొన్న శ్రీ మాతాజీ

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## ఫిబ్రవరి 10 న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, గోరంట్ల, గుంటూరునందు జరిగిన సత్సంగ దృశ్యములు







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.